ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 24.0



ఎగసిపడుతున్న అలలు

నరసాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో తీరప్రాంతంలో సముద్ర అలలు ఎగసి పడుతున్నాయి. పేరుపాలెం, పీఎం లంక వద్ద పది మీటర్ల మేర సముద్రం దూసుకొచ్చింది. తుఫాన్ తీరానికి సమీపిస్తున్న కొలది సముద్రం మరింత కల్లోలంగా మారే అవకాశం ఉండడంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. చినలంక, పీఎంలంక, కేపీపాలెం, పేరుపాలెం, మోళ్లపర్రు గ్రామాలకు చెందిన మత్స్యకారులు బోట్లు, పడవల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. పేరుపాలెం బీచ్‌లోని దుకాణాలను మూయించి వేశారు. పోలీసులు, ఎస్ఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, మెరైన్ పోలీసులు బీచ్‌లో గస్తీ కాస్తున్నారు.



కొల్లేరు వరద ఉధృతి

కైకలూరు, మండవల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కొల్లేరు ప్రజల్లో ఆందోళన నెలకొంది. గ్రామాల చుట్టూ ఇప్పటికే నీరు చేరడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం పెద్దఎడ్లగాడి - పెనుమాకలంక రహదారిపై నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. నందిగామకలంక, పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, పులపర్రు వంటి గ్రామాల చుట్టూ పెద్దఎత్తున నీరు చేరింది. కైకలూరు మండలంలో ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్ నుంచి నీరు ఉధృతంగా కొల్లేరులోకి ప్రవహిస్తోంది. రహదారిపై మరింత నీరు చేరుతుందని అంచనా వేస్తున్నారు.



జలాశయం నీరు విడుదల

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. భారీ వర్ష సూచనతో ముందస్తు జాగ్రత్తగా ఎర్ర కాల్వ జలాశయంలో నీటిని దిగువ ప్రాంతాలకు వదిలారు. మండలంలోని కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయంలో సోమవారం 900 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా దిగువకు 3500 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈఈ సునీత తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా సోమవారం 82.30 మీటర్లకు చేరుకుంది.



1016.22 హెక్టార్లలో వరి, మినుము మునక

ఏలూరు సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను భయం జిల్లాను వెంటాడుతోంది. తుఫాన్ తీవ్రతపై వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. సోమవారం ఉదయం నుంచి ముసురు వాతావరణంతో జల్లులు పడుతూనే ఉన్నాయి. వరితో పాటు అపరాల పంటలు, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేశారు. జిల్లాలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల 1016.22 హెక్టార్లలో వరి, మినుము పంటలు నీట మునిగాయి. 8 మండలాల్లోని 34 గ్రామాల్లో 1,088 మంది రైతుల పంటకు నష్టం వాటిల్లింది. వరి పంట 896.22 హెక్టార్లు, మినుము పంట 120 హెక్టార్లలో మునిగింది. పెదపాడు, లింగపాలెం, కామవరపుకోట, పోలవరం, భీమడోలు, ముదినేపల్లి, కలిదిండి, నూజివీడు మండలాల్లో వరి పంట నీట మునిగింది. వరి పంట పాలుపోసుకునే దశ, కంకిదశ, గింజపోసుకునే దశలో ఉంది. ఈ దశలో భారీగా వర్షాలతో పంటలు దెబ్బతింటాయిని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముదినేపల్లి మండలంలో వరి చేలను జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా పరిశీలించారు. మండలాల్లో వ్యవసాయ శాఖాధికారులు తుఫాను కారణంగా పంట పొలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించడం జరుగుతోంది.

హలో.. హలో..

కలెక్టరేట్ కంట్రోల్‌రూమ్ :9491041419,
టోల్‌ఫ్రీ నెంబర్ : 18002331077
నూజివీడు సబ్ కలెక్టరేట్
కంట్రోల్ రూమ్: 9849903964
టోల్‌ఫ్రీ నెంబరు : 08656232717,
జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం
కంట్రోల్‌రూమ్ 8309269056



తుఫాను సహాయక చర్యలపై సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల, కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ప్రత్యేకాధికారులు

హై అలర్ట్..!

- మొంథా తుఫాన్ దిశపై కలవరం
- ఈ రాత్రి గడిస్తే చాలు..
- భయం గుప్పిట్లో ప్రజలు, రైతులు
- 11 లంక గ్రామాల్లో 82 తుఫాను సహాయక కేంద్రాలు ఏర్పాటు
- జిల్లాకు చేరిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు
- అధికారులు, మంత్రుల సమీక్ష

క్షణ క్షణం.. భయం భయం..

తుఫాన్ ప్రభావంతో జిల్లాలోఎటువంటి నష్టం కలగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి, జిల్లా తుఫాన్ పర్యవేక్షణ ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే, తుఫాన్ పర్యవేక్షక జోనల్ ప్రత్యేకాధికారి ఆర్‌పి సిసోడియా, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్ ముందస్తు సహాయక చర్యలపై సమీక్షించారు. వివిధ శాఖల అధికారులకు సూచనలు ఇచ్చారు. పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు, వాగులు, కాల్వల వద్ద భద్రత, ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు, పోలీస్ పికెట్లపై సర్వసన్నద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు.

ఏలూరు/ ఏలూరు సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఎటువంటి నష్టం కలగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కల్వర్టులు, కాజ్‌వేలు వద్ద ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్లు, ఇతర అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నుంచి తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్న కోణంలోనే ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలకు చెందిన 25 మంది జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఒక ఎస్ఐ పర్యవేక్షణలో 13 మందిని కొల్లేరు పరీవాహక ప్రాంతమైన కైకలూరు నియోజకవర్గానికి తరలించారు. గిరిజన భవన్‌లో 12 మంది రిజర్వ్‌లో ఉంచారు. ఏలూరు నగరం, నూజివీడు, జంగారెడ్డిగూడెం పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోకుండా కట్టలు, చెట్లను తొలగించడానికి ప్రత్యేకంగా ఎక్సకవేటర్లు సిద్ధం చేశారు. ప్రధాన డ్రెయిన్లు, కాల్వలు, చెరువుల వద్ద వరదనీటి ప్రవాహానికి అడ్డంకులను అధికారులు పర్యవేక్షణలో తొలగించారు. చెరువులు, వాగులు పరిసర ప్రాంతాల్లో కట్టలు తెగిపోకుండా 3వేల ఇసుక బస్తాలను జలవనరుల శాఖ సిద్ధం చేసింది. కలెక్టరేట్, నూజివీడు సబ్ కలెక్టరేట్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి 24 గంటలూ పర్యవేక్షణకు సిబ్బందిని నియమించారు.

సీఎం చంద్రబాబు సమీక్ష

తుఫాన్ సహాయక చర్యలపై రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లు, ప్రత్యేకాధికారులతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎవరూ ప్రమాదాల బారిన పడకూడదని, ఒక్క మరణం కూడా సంభవించకూడదనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. తుఫాన్లు ఎదుర్కొనేందుకూ పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని జోనల్, జిల్లా ప్రత్యేకాధికారులు, కలెక్టర్‌కు సూచించారు.

కాజ్‌వేలు, కల్వర్టుల వద్ద జాగ్రత్త

తుఫాను వేళ ప్రజలు కాజ్‌వేలు, కల్వర్టులు దాటకుండా పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి, తుఫాన్ పర్యవేక్షక జోనల్ ప్రత్యేకాధికారి ఆర్‌పి సిసోడియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తుఫాన్ ముందస్తు చర్యలపై జిల్లా ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే,



అధికారులతో సమీక్షిస్తున్న సిసోడియా, కాంతిలాల్ దండే

కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడతో కలిసి అధికారులతో సమీక్షించారు. తుఫాను మంగళవారం తీరం దాటే అవకాశం ఉన్నందున తీవ్రమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 11 లంక గ్రామాలు తుఫాన్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించామని, 82 సహాయక కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆహారం, వైద్య, తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. తుఫాన్ సహాయక కేంద్రాలలో భోజన, వసతి, వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు.

తీరం దాటే సమయంలో గాలులు

తుఫాన్ మంగళవారం తీరం దాటవచ్చని వాతావరణ శాఖ సూచించిందని, తీవ్రమైన వేగంతో గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులు

మిగతా 8వ పేజీలో..

ముందస్తు సహాయక చర్యలు : జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల

ఏలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లాలో ముందస్తు సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 27 పునరావాస కేంద్రాలకు 534 మందిని తరలించి వైద్యం, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. సోమవారం సాయంత్రం వరకు జిల్లాలో సరాసరి 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 408 వార్డు, గ్రామ సచివాలయాల్లో సిబ్బంది, స్థానిక కార్యదర్శి, ఇతర సిబ్బందిని సమన్వయం చేస్తూ తుఫాన్ సహాయ చర్యలపై కలెక్టర్ అప్రమత్తం చేశారని మంత్రి వివరించారు. జిల్లాలో 1123 రేషన్ దుకాణాలకుగాను 583 దుకాణాల్లో సరుకుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. 234 రైతు సహాయ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు చేశాం. ప్రతీ కేంద్రం పరిధిలో 30 టార్పాలిన్లు సిద్ధం చేస్తున్నాం. మొత్తం 4600 టార్పాలిన్లు కొనుగోలు చేశాం. ధాన్యం కొనుగోలు రైతులు ఆందోళన చెందనవసరం లేదు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా 2వేలు విద్యుత్ స్తంభాలను మార్చాం. 500 ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజల అవసరాల కోసం సిద్ధం చేశాం. 211 బీఎస్ఎన్ఎల్ టవర్ల వద్ద పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో జనరేటర్లు ఏర్పాటు చేసిడీజిల్ అందిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో చెట్లు కూలిన, వాగులు, వంకల్లో నీటి పారుదల జరిగేలా చర్యలు చేపట్టేందుకు 27 ప్రొక్లెయినర్లు, ఎక్సకవేటర్లు అందుబాటులో ఉంచామన్నారు.



కొనసాగుతున్న రవాణా శాఖ తనిఖీలు

ఏలూరు క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రవాణాశాఖ అధికారులు ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఉప రవాణాశాఖ అధికారి షేక్ కరీమ్ ఆదేశాల మేరకు ఏలూరు ఆర్టీవో ఎస్‌బి శేఖర్, జంగారెడ్డిగూడెం ఆర్టీవో ఎస్ఎస్ రంగనాయకులు ఆధ్వర్యంలో మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌ప్లాజా, జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డులో ప్రైవేటు బస్సులను గత మూడు రోజుల నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున కూడా తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 35 ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేశారు. టాక్సులు లేకుండా నడుపుతున్న నాలుగు బస్సులను సీజ్ చేశారు.



కలపర్రు టోల్‌ప్లాజా వద్ద సిబ్బంది తనిఖీలు

నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలి

మంత్రి అనగానికి జేఏసీ వినతిపత్రం

నూజివీడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టీఆర్ జిల్లాలో కలపాలని జిల్లాల పునర్విభజన త్రిసభ్య కమిటీ సభ్యుడు, మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు జేఏసీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. అమరావతి సచివాలయంలో జేఏసీ నాయకులు సోమవారం మంత్రిని కలిశారు. మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ కైకలూరు, నూజివీడు నియో జకవర్గాలను ఉమ్మడి కృష్ణాజిల్లాలో కలిపే అంశంపై పరిశీలన చేస్తామన్నారు. జేఏసీ అధ్యక్షుడు శివరామకృష్ణ, సభ్యులు పేరం శివనాగేశ్వరరావు, చింతా అనిల్ కుమార్, చాట్ల పుల్లారావు, ఎం.సునీల్‌కుమార్ తదితరులు మంత్రికి వినతిపత్రం ఇచ్చారు.



మంత్రికి వినతిపత్రం ఇచ్చిన జేఏసీ నాయకులు



విజయవాడ వెళుతున్న తాడేపల్లిగూడెం డీసీసీబీ శాఖ ఉద్యోగులు

బోసిపోయిన సొసైటీ కార్యాలయాలు

విజయవాడ ధర్నాకు తరలిన ఉద్యోగులు

ఏలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సొసైటీ ఉద్యోగులు సోమవారం పోరుబాట పట్టారు. మూకుమ్మడి సెలవులతో విజయవాడలోని ఆప్కాబ్ కార్యాలయం వద్ద ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చాలా కాలం నుంచి పీఆర్‌సీ అమలు చేయకపోవడం, పదోన్నతులు కల్పించకపోవడం, వివిధ పనిభారాలతో సతమతం అవుతున్నామని ఉద్యోగులు ఈ ఆందోళనకు ఉపక్రమించారు. వీరి ధర్నాతో సొసైటీల్లో వివిధ సేవలు నిలిచిపోయాయి.


పలు రైళ్లు, విమాన సర్వీసులు రద్దు

ఫస్ట్ పేజీ

గురువా.. ఎందుకీ ఆలస్యం?!

విధులకు ఆలస్యంగా హాజరైన 2018 మంది టీచర్లు





కార్తీక సోమవారం

కార్తీక సోమవారం శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి, ఏలూరు గాంధీనగర్ అవిముక్తేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ కిశోర్

జిల్లాలో పోలీస్ పికెట్లు

- ఏలూరు డిస్ట్రిక్ట్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు
- ఒక ఎస్ఐ, 15 మంది సిబ్బందితో ఫోర్స్
- చేపల చెరువుపై ప్రమాదం జరిగితే యజమానులే బాధ్యులు
- హోర్డింగులు వల్ల ప్రమాదానికి యజమానిపై కఠిన చర్యలు

ఏలూరు క్రైం/కైకలూరు/నూజివీడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను, కలిదిండి మండలంలో ప్రాంతాలను ఎస్పీ కేపీఎస్. కిశోర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పెదపాడు, కైకలూరు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చేపల చెరువులు, రొయ్యల చెరువుల యజమానులు చెరువుల వద్ద షెడ్ల వద్ద నివాసం ఉంటున్న వారు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని సూచించారు. ఎక్కడైనా చేపల చెరువు వద్ద ఏదైనా ప్రమాదం సంభవిస్తే సంబంధిత చేపల చెరువు యజమానిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. హోర్డింగుల వల్ల ప్రమాదం జరిగితే యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముందస్తుగా ఏలూరు డిస్ట్రిక్ట్ రెస్పాన్స్ ఫోర్స్ (ఈడీఆర్ఎఫ్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలను డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. వాగులు, వంకలు, కాలువలు ఉన్న మార్గాల్లో ప్రమాదకరంగా ఉన్న వాటి వద్ద పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశారు. పోలవరం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, జంగా రెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కైకలూరు పోలీసుస్టేషన్ వద్ద ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలకు ఎస్పీ కేపీఎస్ కిశోర్ పలు సూచనలు ఇచ్చారు. 70-80కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని చెరువు గట్లపై రేకులషెడ్లు ఎగిరిపోయే ప్రమాదం ఉందని, కూలీలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. నూజివీడు పట్టణంలోని పలు ప్రాంతాలను ఎస్పీ కిశోర్, సబ్ కలెక్టర్ వినూత్న సోమవారం పరిశీలించారు. పెద్దచెరువు, మొగలి చెరువు తదితర ప్రాంతాలను పరిశీలించి వరదలు వస్తే తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సూచనలు చేశారు. తుఫాను ప్రభావానికి గురయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. డీఎస్పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి కృష్ణారెడ్డి

పాఠశాలల్లో తుఫాన్ సహాయ పునరావాస కేంద్రాలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల నిమిత్తం ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు హెచ్ఎంలు అందుబాటులో ఉండాలని విద్యాశాఖ ప్రత్యేకాధికారి కృష్ణారెడ్డి ఆదేశించారు. డీఈవో కార్యాలయం నుంచి అన్ని మండలాల ఎంఈవోలతో సోమవారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో పలు సూచనలు చేశారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు గుర్తించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఇవ్వాలన్నారు. వర్షాలకు ఐఎఫ్‌పి ప్యానెళ్లు, బియ్యం నిల్వలు, స్కూలు రికార్డులు పాడవకుండా భద్రపర్చాలని కోరారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్సు ల్యాబ్‌లలో విలువైన పరికరాలు, రసాయనాలను జాగ్రత్తపర్చాలన్నారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్లు అవధాని, వెంకటప్పయ్య, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

208 మంది గర్భిణుల తరలింపు

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో 82 పునరావాస కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సోమవారం ప్రారంభించింది. ఈ కేంద్రాల్లో అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్టు జిల్లా వైద్యాధికారి డాక్టర్ అమృతం, పరిపాలనాధికారి డాక్టర్ గంగాభవాని తెలిపారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా మొత్తం 208 మంది గర్భిణులను గుర్తించి, వారినందరినీ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు తరలించినట్టు అమృతం వివరించారు. గర్భిణుల వైద్య పర్యవేక్షణ బాధ్యతలను సంబంధిత మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అప్పగించామన్నారు.



గునుపూడి సౌత్ వద్ద నిండుగా ప్రవహిస్తున్న డ్రెయిన్

డ్రెయిన్లు మొరాయిస్తే సాగుకు గండమే

గడిచిన ఆరేళ్లలో డ్రెయిన్ల అభివృద్ధి అంతంతే

భీమవరం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావంతో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నాయి. సార్వా వరిచేలల్లోకి వర్షపు నీరు చేరుతుంది. ఈ సమయంలో మురుగు డ్రెయిన్‌లు మొరాయిస్తే సాగుకు గండం తప్పదు. నాలుగు రోజుల క్రితం అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు డ్రెయిన్ నిండుగా ప్రవహిస్తుంది. మళ్లీ మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణం శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మురుగు డ్రెయిన్ పైనే సార్వా సాగు ఆధారపడింది. గడిచిన ఆరేళ్లలో మురుగు డ్రెయిన్ అభివృద్ధి అంతం మాత్రంగానే జరిగింది. ఇప్పుడు సాగును ముంచేలా మారింది. జిల్లాలో మేజర్, మైనర్ డ్రెయిన్‌లు దాదాపు 120 ఉన్నాయి. ప్రస్తుతం సాగు చేసిన సార్వా సాగు రెండు లక్షల ఎకరాలు ఈ డ్రెయిన్‌లపైనే ఆధారపడి ఉంది. గడిచిన మేలోనే డ్రెయిన్‌లో చెత్త తొలగించారు. మట్టి పూడికతీతలకు నోచుకోలేదు.

అయోమయంలో రైతన్నలు

- లక్ష ఎకరాల్లో పంటకు ముప్పు
- తుఫాన్‌తో కష్టం చేజారుతుందా ?





భీమవరం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావం పశ్చిమ గోదావరి జిల్లాపై అతిగా చూపించడంతో రైతన్నలు అయోమయంలో పడ్డారు. పంటను గట్టెక్కించే అవకాశాలు ఏమాత్రం లేనందున గందరగోళం నెలకొంది. జిల్లాలో దాదాపుగా లక్ష ఎకరాలకు మరింత గండంగా మారింది. ఈనిక, పాలు పోసుకునే దశలో ఉన్నందున ఈదురుగాలులు, భారీ వర్షాలకు నీటమునిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల వరిచేలు నీళ్ల పాలవుతున్నాయి. పంట మాసూళ్ల దశకు చేరుకున్న ధాన్యం రాశులుగా ఉన్న రైతులు వాటిని చాలా వరకు గట్టుకు చేర్చుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఏమీ చేయలేని దీనస్థితిలో రైతన్నలు తుఫాన్ ప్రభావం తక్కువ ఉంటే బాగుండును అని వేడుకునే పరిస్థితుల్లో ఉన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రొయ్యల చెరువులలో నీటిమట్టం పెరిగింది. మళ్లీ వర్షాలు ఎక్కువయితే చెరువుల గట్లు మునిగి నష్టం చేకూరుస్తుందని రైతులు ఆందోళనలో ఉన్నారు.

తుఫాన్ ఎఫెక్ట్..



ద్వారకాతిరుమలలో దాదాపు ఖాళీగా వున్న దర్శనం క్యూలైను

వెంకన్నకు తగ్గిన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీపై మొంథా తుఫాన్ తన ప్రభావాన్ని చూపింది. నిత్యం భక్తజనులతో కళకళలాడే ఆలయం తుఫాన్ ప్రచారం కారణంగా అరకొరగా వచ్చారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తుల లేమితో ఖాళీగా కన్పించాయి. ఈ రెండురోజులూ భక్తులు తక్కువగానే విస్తారని అధికారులు భావిస్తున్నారు.



ఆకివీడులో పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌పై కప్పిన బరకం

ఆకివీడు పోలీస్ స్టేషన్‌పై కప్పిన బరకం

ఆకివీడు : ఆకివీడు పోలీస్ స్టేషన్ శిథిలావస్థకు చేరింది. తరచూ పెచ్చులూడుతుండడంతో అధికారులు, సిబ్బంది, జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నానిపోవడంతో ముందస్తు చర్యగా పోలీస్ స్టేషన్‌పై బరకం కప్పారు. సంబంధిత ఉన్నతధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



తుఫాన్ ప్రభావంతో హడావుడిగా పత్తిని ఇంటికి చేరుస్తున్న రైతాంగం

పత్తి రైతుల్లో భయాందోళన

- హడావుడిగా సేకరించి ఇంటికి చేరుస్తున్న రైతులు

కుక్కునూరు : తుఫాన్ భయం పత్తి రైతాంగాన్ని వెంటాడుతోంది. ఈ ఏడాది ఇప్పటికే విస్తారంగా కురుసిన వర్షాలతో పత్తిపంటకు తీవ్ర నష్టం మిగిల్చింది. వర్షానికి పూత, పిందె రాలిపోయి అడుగు భాగంలో ఉన్న కాయలు రాలుతున్నాయి. ఈ క్రమంలో పత్తి రైతులు పత్తి చెట్లకు 20-30 కాయలు మాత్రమే కాపు ఉంది. ఇదే సమయంలో పత్తిచెట్టుకు ఉన్న కాయలు పగిలి పత్తిబయటకు వస్తుంది. వర్షం కురిస్తే పత్తి నేలరాలిపోతుందన్న భయం రైతాంగంలో ఉంది. గత రెండురోజులుగా పంటలో పత్తిని సేకరిస్తున్నారు. అనంతరం ఆ పత్తిని బస్తాల్లో వేసుకుని ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల సాయంతో ఇంటికి చేరుస్తూ హడావుడిగా పనులు చేస్తున్నారు.

కేంద్ర సాయానికి ప్రయత్నిస్తా

- తుఫాన్ ప్రభావంపై కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరంటౌన్,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌కు సంబంధిత సాయాన్ని జిల్లాకు కేంద్రం నుంచి సాయం అందించేలా ప్రయత్నాలు చేస్తానని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. ఢిల్లీ నుంచి ఆయన ప్రస్తుత తుఫాన్ పరిస్థితిపై సోమవారం ఆరా తీశారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేశ్‌తో చర్చించారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాగం తీసుకున్న చర్యలను కలెక్టర్, ప్రత్యేకాధికారి ఆయనకు వివరించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్

ఏలూరుటూటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల ప్రజలకు ముంపు పొంచిఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సహాయ సౌకర్యాలు కల్పించాలని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. తుఫాన్ పరిస్థితిపై సమీక్షా, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాల నేపథ్యంలో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొల్లేరు, ఉప్పుటేరు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్ శాఖల సమన్వయంతో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తుఫాన్‌పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. ఆపదలో ఉన్న ప్రజలు 94910 41419, 98855 19299 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మొంథా గండం

మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి పశ్చిమ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి చేలల్లో నీళ్లు నిలిచాయి. డ్రెయిన్లు పొంగుతున్నాయి. ఈ డ్రెయిన్లు మొరాయిస్తే సాగుకు ఇబ్బందులు తప్పవని వరి రైతుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు దేవుడా ఈ తుఫాన్ గండం దాటించాలని ఆక్వా రైతులు మొక్కుతున్నారు. ఇప్పటికే పొలాలు ముంపునకు గురైతే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సూచనలు చేస్తున్నారు. ఏది ఏమైనా మొంథా తుఫాన్ ఎఫెక్ట్ వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో మరింత ఎక్కువగా కనిపిస్తుందని తెలుస్తుంది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పరిస్థితులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

తుఫాన్‌పై జాగ్రత్తలు ఇలా..

భీమవరంటౌన్ : తుఫాన్ సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఎంతటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉంది. అధికారుల సూచనలను సత్వరమే పాటిస్తూ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ప్రభుత్వ అధికారులు సూచించిన వెంటనే ఆయా ప్రాంతాల వారు సురక్షితప్రాంతాలకు తరలి వెళ్లాలి. పునరావాస కేంద్రాల్లో భోజన సవతి, విద్యుత్, వైద్య సౌకర్యాలు కల్పించారు.
- పురాతన భవనాలు, శిథిలావస్థలలో ఉన్న భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, వైర్ల వద్ద ఉండొద్దు.
- ముఖ్యంగా విలువైన పత్రాలు, వస్తువులను సురక్షితంగా ఉంచుకోవాలి.
- పశువులు, పెంపుడు జంతువులను కట్టకుండా వదిలి వేయాలి.
- ఉరుములు, పిడుగులు వంటివి పడే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.
- విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. విద్యుత్ ఉపకరణాల కనక్షన్ తీసి వేయాలి. కిటికీలు, తలుపులు మూసివేసి ఉంచడం మంచిది.
- తుఫాన్ సమయంలో సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నో వార్తలు వస్తాయి. అపోహలు కల్పిస్తారు. వాటిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దు.
- అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్ కోసం మొబైల్‌ను ఎప్పటికప్పుడు చార్జింగ్ చేసుకోవాలి.. లేకపోతే ఆపద సమయంలో ఇతరులకు సమాచార ఇచ్చే అవకాశం ఉండదు.
- ప్రభుత్వం, వాతావారణ శాఖ ఎప్పటికప్పుడు తుఫాన్ హెచ్చరికలను జారీ చేస్తోంది. సమాచారాలను అందిస్తోంది. ప్రజలు వాటిని నిరంతరం గమనిస్తూ ఉండాలి.
- తుఫాన్ సమయంలో అత్యవస వస్తువులు, సామగ్రిని సిద్ధం చేసుకోవాలి.
- వాగులు, వంకలు పొంగే అవకాశం ఉంటుంది. వాటిలో దిగే ప్రయత్నాలు చేయకూడదు.
- మొంథా తుఫాన్‌తో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. తీర ప్రాంతానికి వెళ్లి సముద్రంలో దిగే సాహసం చేయకూడదు. పేరుపాలెం బీచ్‌లో పోలీసులు గస్తీ కాస్తున్నారు.
- కార్తీక స్నానాల కోసం గోదావరి, కాల్వల్లోకి సముద్రంలోకి దిగవద్దు.
- తుఫాన్‌లో ఆపద ఎదురైతే ప్రభుత్వం ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు సంప్రదించండి.

తుఫాన్ ఎఫెక్ట్‌తో ఉమ్మడి పశ్చిమ జిల్లాలో భారీ వర్షాలు.. తప్పని కష్టనష్టాలు

ఈసారి గట్టెక్కించు దేవుడా..

- ఎడతెరపిలేని వర్షాలకు చనిపోతున్న చేపలు, రొయ్యలు
- మొక్కుతున్న ఆక్వా రైతులు



ఆక్వా చెరువు

ఆకివీడురూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఆక్వారైతులకు గండంగా మారింది. కొద్దిరోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండాలతో ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీవర్షాలకు ఆక్వారైతులు చిగురుటాకులా వణికిపోతున్నారు. భారీ వర్షాల వల్ల చెరువుల్లో నీటిమట్టం పెరిగిపోయింది. నీటిలోని శెలనిటీ తగ్గిపోవడంతో పాటు నీటిరంగు తగ్గిపోతుంది. దీనివల్ల రొయ్యలకు అందాల్సిన పోషకాలు, మినరల్స్ తగ్గిపోతాయి. ఎండలేకుండా వర్షాలు కురుస్తుంటే నీటిలోని ఉష్ణోగ్రత తగ్గిపోతుంది. ఈమేరకు నీటిలో పీహెచ్ తగ్గి, ఆక్సిజన్ శాతం తగ్గిపోవడంతో రొయ్యలు చనిపోయి కిందకు దిగిపోతాయి. చేపలు పైకి వచ్చి ఆక్సిజన్ అందక తిరుగుతూ చనిపోతాయి. వీటితో పాటు వైరస్ ప్రభావం పెరిగిపోతుంది. రొయ్యలకు సాధారణంగా ఎండ ఎక్కువగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాయి. లేదంటే వైరస్, విబ్రియో వంటివి సోకి నష్టం వాటిల్లుతుంది. వాతావరణంలో వచ్చిన మార్పులు వల్ల రైతులు భయాందోళనలకు గురవుతున్నారు.

వణికిపోతున్న ఆక్వారైతులు..

ప్రభుత్వం, వాతావరణ శాఖల నేపథ్యంలో ప్రారంభమైన మొంథా తుపాన్ పేరు చెబితేనే రైతులు వణికిపోతున్నారు. సోమవారం ఉదయం నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తుందనడంతో, చెరువులలో నీటి మట్టం అమాంతం పెరిగిపోతుందని, ఇప్పటికే నీటి పరిమాణం పెరిగిన రైతులు ఆందోళన చెందుతున్నారు. 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని చెబుతుండడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోవచ్చని, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడం వల్ల జనరేటర్ డీజిల్‌కు అదనపు ఖర్చు పెరిగిపోతుందని అంచనా వేస్తున్నారు. గాలి అంతవేగంగా వీస్తే చెరువుచుట్టూ కంచెలా ఏర్పాటు చేసిన ఆపాలు ఎగిరిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 40 వేల ఎకరాల్లో ప్రస్తుతం సాగు జరుగుతుందని, సాగు ప్రారంభమై ఇంచుమించుగా 20 రోజులు అవ్వవచ్చని, వీరందరికి ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు. ఇప్పటికే ధరలు తగ్గిపోవడం, వ్యాధులు బారిన పడి నష్టాలు పాలవుతున్న రైతులకు వాతావరణం రూపంలో మరో పెద్ద సమస్య వచ్చిపడింది.

వర్షాలతో అతలాకుతలం



గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆక్వా అతలా కుతలం అవుతోంది. నీటిలో ఉష్ణోగ్రత తగ్గిపోయి, ఆహారం తీసుకోవు, వ్యాధులు బారిన పడతాయి. ఆక్సిజన్ పరిమాణం తగ్గి రొయ్యలు, చేపలు చనిపోతాయి. ప్రస్తుత వాతావరణం ఆక్వారైతులకు పెద్దశత్రువుగా మారిపోయింది. గండం దాటించు దేవుడా అని మొక్కడం తప్ప గత్యంతరం లేదు.

– డి.కన్నబాబు
ఆక్వారైతు, కొల్లపర్రు

మొంథా అంటే భయమేస్తుంది



మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భయమేస్తుంది. ఇప్పటికే అన్ని రకాలుగా నష్టపోతున్నాం. ఇప్పుడు ఈ తుఫాను వల్ల విద్యుత్, ఇతర ఇబ్బందులతో భయాందోళనలు కలుగుతున్నాయి. వరదలు వచ్చే ప్రమాదం ఉండడం మరింత భయమేస్తుంది. అప్పులు చేసి సాగులు చేస్తున్నాం, ప్రకృతి శాంతిస్తేనే ఆక్వామనుగడకు అవకాశం.

– కె.హనుమ
ఆక్వారైతు, గుమ్ములూరు

ఆక్వా రైతులకు జాగ్రత్తలు ఇలా..

ఉండి : భారీ వర్షాల వల్ల రొయ్యలు, చేపల చెరువుల్లో ఆక్వా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉండి కృషి విజ్ఞానకేంద్రం ఫిషరీస్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. వాతావరణం పరిస్థితుల నేపథ్యంలో ఆక్వారైతులకు శాస్త్రవేత్త సూచనలు అందించారు. ప్రస్తుతం తుఫాన్ ప్రభావంతో చేపలు రొయ్యల చెరువులలో ఆక్సిజన్ లోపం ఏర్పడడం, అమ్మోనీయం, హెచ్2ఎస్ వంటి విషవాయువులు ఉత్పత్తి అయి చేపలకు, రొయ్యలకు ఒత్తిడి కలిగి వ్యాధులకు గురికావడం, చనిపోవడం సంభవిస్తున్నాయి. ప్రధానంగా పెద్ద సైజు చేపలు శంఖుజలగ, బ్యాక్టీరియా వ్యాధి వున్న చేపలు ఎక్కువగా



ఉండి రొయ్యలను పరిశీలిస్తున్న కేవీకే ఫిషరీస్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు

చనిపోతాయి. ముందుగానే చెరువునీటిని పరీక్షించుకుని నీటి ఆక్సిజన్ స్థాయి ఐదు పీపీఎం కంటే తక్కువగా వున్నట్టు గుర్తిస్తే వెంటనే ఏరియేటర్లు లేదా రీసర్క్యులేషన్ చెరువునీటిని చెరువులోకి తోడడం లేదా బోటు తిప్పడం రాత్రి పది గంటలు నుంచి ఉదయం ఎండ వచ్చే వరకు ఏర్పాటుచేసుకోవాలి. శంఖుజలగ వ్యాధులున్నట్లు గమనిస్తే పొటాషియం పెర్మాంగనేటు ఎకరానికి అరకేజీ నుంచి ఒక కేజీ వరకు తెల్లవారుజామున చెరువునీటిలో చల్లుకోవాలి. సాయంత్రం పూట జియోలైటు ఎకరానికి పది కేజీలు, గేనోనెక్స్ ముక్క కలిగిన పౌడర్‌ను పావుకేజీ ఎకరానికి అమ్మోనియం తగ్గడానికి చల్లుకోవాలి. వర్షం పడితే అగ్రికల్చరల్ లైమ్ ఎకరానికి 30 కేజీలు చల్లుకోవాలి. మేతలు గమనించి తక్కువగా ఇవ్వాలి. వారానికి ఒకరోజు మేత ఇవ్వడం మానివేసిన మంచిది. ఏవిధమైన రసాయనాలు, ఎరువులు వాడవద్దంటూ సూచించారు.

పలు రైళ్లు, విమాన సర్వీసులు రద్దు

ఏలూరుక్రైం/భీమవరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. సోమవారం విశాఖ-ఎల్‌టీటీ (18519), మంగళవారం ఎల్‌టీటీ-విశాఖ(18520) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి తెలిపారు. అలాగే 28వ తేదీ మంగళవారం విజయవాడ-భీమవరం(67281), భీమవరం-విజయవాడ(67282), భీమవరం-నిడదవోలు(67283), నిడదవోలు-భీమవరం(67284), నరసాపురం-నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం(67245), నరసాపురం-రాజమండ్రి (67246), నరసాపురం-విజయవాడ (67276), భీమవరం-నిడదవోలు (67277), నిడదవోలు-భీమవరం(67278), నరసాపురం-గుంటూరు(67247), విజయవాడ-నరసాపురం (67257), రాజమండ్రి-భీమవరం(67241), 29వ తేదీ బుధవారం భీమవరం-నిడదవోలు(67242), నిడదవోలు-నరసాపురం(67243), నరసాపురం-నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం(67245), భీమవరం-నరసాపురం(17263) రైళ్లను రద్దు చేశారు.

ఏలూరు జిల్లా మీదుగా..

తుఫాన్ నేపథ్యంలో ఏలూరు జిల్లా మీదుగా వెళ్లే కొన్ని రైళ్లను ఈనెల 28న కొన్ని రైళ్లను, ఈనెల 29న మరికొన్ని రైళ్లను రద్దు చేశారు. విజయవాడ - రాజమండ్రి(67262), విజయవాడ-కాకినాడ పోర్టు (17257), విజయవాడ-రాజమండ్రి(67202) రాజమండ్రి - విజయవాడ (67201), రాజమండ్రి - విజయవాడ (67261), కాకినాడ పోర్టు-విజయవాడ (17258), తిరుపతి-విశాఖపట్టణం (08584), విశాఖ పట్టణం-గుంటూరు(22875), గుంటూరు-విశాఖ పట్టణం(22876), తిరుపతి- విశాఖ పట్టణం(22708), హైదరాబాద్- విశాఖ పట్టణం(12728), మహబూబ్ నగర్-విశాఖపట్టణం(12862), చెన్నై సెంట్రల్- విశాఖ పట్టణం(22870), సికింద్రాబాద్- విశాఖ పట్టణం(12740), భువనేశ్వర్- బెంగళూరు(18463),



భువ నేశ్వర్-సికింద్రాబాద్ (17015), భువ నేశ్వర్-పాండిశ్చరి (20851), సికింద్రాబాద్-భువనేశ్వర్(18464) రైళ్లను రద్దు చేశారు.

విమాన సర్వీసులు..

రాజమహేంద్రవరం, : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం (మధురపూడి) ఎయిర్ పోర్టు నుంచి విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు అధికారులు అప్రమత్తం అయ్యారు. మంగళవారం ఉదయం 9-30గంటల లోపు నడిచే ఢిల్లీకి 1, హైదరాబాద్‌కు 2 సర్వీసులు మాత్రమే యథావిధిగా నడుస్తాయి. తరువాత సర్వీసులన్నీ రద్దు అయినట్టు ఎయిర్‌పోర్టు ఇన్‌చార్జి అధికారి వీరవల్లి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ముంబై, తిరుపతి, బెంగళూరు, చెన్నై సర్వీసులు అన్నీ రద్దు అయి నట్లే. ఇక ఎయిర్‌పోర్టు రన్‌వే పరిసర ప్రాంతాల్లో నీరు చేరకుండా చెట్లకొమ్మలు అడ్డురాకుండా హెలికాప్టర్లు అత్యవర సమయంలో లాండ్ అయ్యేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

మొంథాకు ముందే మునిగిన మినుము రైతు





వర్షాలకు దెబ్బతిన్న మినుము తోటను చూపుతున్న సీపీఎం నాయకులు

మొలకెత్తిన మినుము పంట

- నూజివీడు డివిజన్‌లో 90 శాతం పంట నష్టం
- 15 వేల ఎకరాల్లో మినుము సాగు
- ప్రభుత్వ ఆదుకోవాలని రైతుల వినతి

నూజివీడు టౌన్ : మొంథా తుఫాన్‌కు ముందే మినుము రైతు నిండా మునిగాడు. వారంరోజులుగా నూజివీడు డివిజన్ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు కోతవచ్చిన మినుము మొలకెత్తి తీవ్రనష్టం చేకూరింది. వాణిజ్య పంటలకు సైతం తీవ్రనష్టం వాటిల్లింది. నూజివీడు నియోజకవర్గ పరిధిలో నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాలు దాదాపుగా మెట్టప్రాంతాలుగా ఉన్నాయి. ప్రతి సీజన్‌లో ఈ మండలాల్లో సీడ్‌పత్తి సాగవుతూ ఉంటుంది. ప్రస్తుత సీజన్‌లో సీడ్ పత్తిని ఆర్గనైజర్లు ఇవ్వకపోవడంతో రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపారు. మొక్కజొన్న సీజన్ నవంబరు నుంచి ప్రారంభం అవుతుండడంతో తొలిపంటగా మినుము సాగు చేశారు. సరిగ్గా కోతకు వచ్చే సమయంలో భారీ వర్షాలు కురవడంతో నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో సాగవుతున్న కోతకు వచ్చిన మినుముపంట తడిచి ముద్దవుతోంది. నూజివీడు డివిజన్లలో 90 శాతం పంట నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. తడిచిన కాయి బూజురావడంతో పాటు అనేక ప్రాంతాల్లో కాయల్లోనే గింజలు మొలకెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రామన్నగూడెంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న మినుము పంటను రైతు సంఘం నాయకులు, సీపీఎం నాయకులు సోమవారం పరిశీలించారు.

ఎకరానికి 40 వేలు ఖర్చు..

కౌలు, దుక్కి, విత్తనం, పురుగు మందులు, ఇతరత్రా కలిపి ఎకరానికి రూ.30వేల నుంచి రూ.40 వేలవరకు మినుము సాగుకు పెట్టుబడి అయంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రైతుకు ఒక్కరూపాయి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మొంథా ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ఇప్పటికే నష్టపోయిన మినుమును తీత తీయకుండానే దుక్కిదున్నేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన మినుముపంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టనివారణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మినుము రైతులను ఆదుకోవాలి



నూజివీడు నియోజకవర్గం ప్రధానంగా మెట్టప్రాంతం పొగాకు, పత్తితో పాటు మినుము అత్యధికంగా సాగు చేస్తున్నాం. ప్రస్తుతం కురిసిన భారీవర్షాలకు మినుము రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో తడిచిన మినుములను ప్రభుత్వం కొనుగోలు చేయడంతో పాటు తీవ్రంగా నష్టపోయిన రైతులకు పంట రుణమాఫీ చేసి నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– చలసాని వెంకటరామారావు
రైతు నాయకుడు

గురువా.. ఎందుకీ ఆలస్యం?!

- ఏలూరు జిల్లాలో ఆలస్యంగా హాజరైన టీచర్లు 2018 మంది!
- ఉదయం 9 గంటలకే అటెండెన్స్ : డీఈవో ఆదేశం

ఏలూరు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):జిల్లాలో పలువురు టీచర్లు కచ్చితమైన సమయానికి పాఠశాల విధులకు హాజరుకావడం లేదు. ఉదయం 9 గంటలకే తరగతులు ప్రారంభమవుతుండగా, కొందరు ఉపాధ్యాయులు పది నిమిషాలు, అంతకంటే ఆలస్యంగా హాజరును నమోదు చేస్తున్నట్టు అధికారికంగా గుర్తించారు. ప్రస్తుత విద్యాసంవత్సరం పాఠశాల పనిదినాల్లో ఇంతవరకు మొత్తం 2018 మంది టీచర్లు ఉదయం 9.10 గంటల తర్వాతే హాజరును నమోదు చేసిన విషయాన్ని జిల్లావిద్యాశాఖ సోమవారం వెల్లడించింది. ఆ మేరకు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆలస్యపు హాజరు నమోదు టీచర్ల వివరాలను డీవైఈవోలు, ఎంఈవోలకు పంపించారు. ఇలా ఆలస్యంగా హాజరును వేస్తున్నవారిలో గరిష్ఠంగా 65 రోజులు, అంతకుపైబడి రోజుల్లో లేటుగా అటెండెన్సును నమోదు చేస్తుండడం గమనార్హం.

ఏలూరు జిల్లాలోని మొత్తం 27 మండలాల్లో అత్యధికంగా జిల్లా కేంద్రంలోనే 232 మంది ఉపాధ్యాయులు కచ్చితమైన సమయంలో హాజరును నమోదుచేయడం లేదని గుర్తించారు. ఆ తదుపరి బుట్టాయగూడెం మండలంలో 216 మంది, నూజివీడు మండలం-188 మంది, చింతలపూడి మండలం-106 మంది, జంగారెడ్డిగూడెం మండలం-101మంది టీచర్లు సకాలంలో హాజరు నమోదుచేయడం లేదు. తరచూ నెట్‌వర్క్ సమస్యలు, మారుమూల ప్రాంతాలలో ఉండే కుక్కునూరు మండలంలో 69 మంది, వేలేరుపాడు మండలంలో 67 మంది, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, టి.నరసాపురం, తదితర మండలాల్లో సకాలంలో హాజరు నమోదు చేయని టీచర్ల సంఖ్య రెండంకెలను మించకపోవడం విశేషం. ఈ నేపథ్యంలో జిల్లాలో హాజరును ఆలస్యంగా నమోదు చేస్తున్న టీచర్ల జాబితాలో ఉన్నవారంతా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజు ఉదయం 9 గంటలకు అటెండెన్స్‌ను నమోదుచేయాలని, ఆలస్యాన్ని సరిచేసుకునేందుకు ఒక అవకాశాన్నిస్తున్నట్టు హెచ్చరించారు. పాఠశాల విధులకు ముందుగానే హాజరవుతున్నా నెట్‌వర్క్ సమస్యలవల్లే హాజరునమోదులో జాప్యం జరగడానికి కారణమవుతోందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.



భీమవరంలో మాట్లాడుతున్న పాకా వెంకట సత్యనారాయణ, నాయకులు

త్వరలో కేన్సర్ సర్వే బృందం రాక : పాకా

భీమవరంటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):'రాష్ట్రంలోనే అత్యధికంగా కేన్సర్ రోగులు పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్నట్టు తాజా సమాచారం. ఈ మేరకు జిల్లాలో కేన్సర్ వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించేందుకు సర్వే బృందం త్వరలో జిల్లాకు రానుంది' అని రాజ్యసభ సభ్యులు, సైన్స్ అండ్ టెక్నాలజీ పర్యావరణ విభాగం పార్లమెంటరీ కమిటీ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ తెలిపారు. సోమవారం భీమవరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న కేన్సర్ కణాల నివారణ ప్రక్రియపై కొత్తగా వచ్చిన టెక్నాలజీని కేంద్ర పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తరపున ఇటీవల బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించానన్నారు. ఆ సెంటర్లో కేన్సర్ నివారణకు కొత్త టెక్నాజీని అమలు చేసి విజయవంతమైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఈ టెక్నాలజీ ద్వారా మన జిల్లాలో కేన్సర్ రోగులపై సర్వే చేసి వారి ఆ ప్రమాదం నుంచి విముక్తి చేసే ప్రక్రియ అమలు చేస్తామన్నారు.బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, కోమటి రవికుమార్, అడబాల శివ, వబిలిశెట్టి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు

చెస్ పోటీల్లో సీఆర్ఆర్ విద్యార్థులకు పతకాలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):ఏపీ రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు పలువురు బహుమతులు గెలుచుకోగా, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఒక విద్యార్థి జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. జంగారెడ్డిగూడెంలో ఈనెల 26న జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో స్కూలు విద్యార్థులు 11 స్వర్ణ పతకాలు, ఒక ద్వితీయ బహుమతి, 3 షీల్డ్‌లు అందుకున్నారని విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపాల్ సాయికుమారి తెలిపారు. అద్వైహ, గణేశ్, అగస్త్య, రుత్విక్, దీపక్, జౌషిక్, చరణ్, దిశాంత్, జీవన్, మనోజ్, సాయిసాత్విక్, యశ్వంత్, జేష్నా, తనిష్‌రెడ్డి గోల్డ్‌మెడల్స్ సాధించగా, పదోతరగతి విద్యార్థి నవదీప్ టోర్నమెంట్ ద్వితీయ బహుమతి గెలుచుకుని జాతీయస్థాయి టోర్నీకి ఎంపికయ్యాడని వివరించారు. విజేతలను, పీఈటీ సోమరాజును అభినందించారు.

కరాటే పోటీల్లో..

సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించిన ఆలిండియా కరాటే చాంపియన్‌షిప్(బడేటి కప్) కటా విభాగం పోటీల్లో పబ్లిక్ స్కూలు విద్యార్థులు జీయర్వి, సిద్ధార్థ, సాయిసాత్విక్, హర్షిణి, రాహుల్ దత్త, గౌతమ్‌లకు స్వర్ణపతకాలు, నాగహేమచంద్ర, నాగభార్గవ్, శరణ్య, దుర్గేశ్, జ్ఞానశ్రీ దీపక్, శర్మ, ఆదిత్య నాగవర్ధన్, లవలిఖలకు రజిత పతకాలు లభించాయని తెలిపారు. కుమితే విభాగం పోటీలో గౌతమ్, రాహుల్‌శ్రీదత్త, జీయర్వి, సాయిసాత్విక్, శరణ్యలకు పతకాలు లభించాయన్నారు.

సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడల ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29న ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో జరగాల్సిన ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు, పురుషులు, మహిళలకు పలు క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపికలు తుఫాన్ కారణంగా ఎంపిక పోటీలు వాయిదా వేశామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీలు ఎప్పుడు జరిగేది అనే విషయంపై తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలు

ఏలూరుటూటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జర్మనీ దేశంలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన మైనార్టీ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తెలిపారు. ఐటీఐ, మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమోలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 30ఏళ్ల లోపు వయస్సు ఉండి రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.2 లక్షల 60 వేలు జీతం ఉంటుందన్నారు. నవంబరు రెండో తేదీలోగా ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99888 53335, 87901 17279/8349 నంబర్లలో సంప్రదించాలన్నారు.



ప్రత్యేక అలంకరణలో గునుపూడి సోమేశ్వరస్వామి







పాలకొల్లు క్షీరారామంలో స్వామివారికి పూజలు.. ఆచంటలో ఆచంటేశ్వరుడికి, ఏలూరు పత్తేబాద చౌడేశ్వర రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు

హరహర మహాదేవ..

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- ఘనంగా కార్తీక సోమవారం పూజలు

భీమవరం టౌన్: భీమవరంలోని పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూ కట్టారు. 20 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు అంచనా. తుఫాన్ కారణంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారి సంఖ్య తక్కువగానే కనిపించింది. భక్తులకు వెంపకు చెందిన గొట్టుముక్కల భీమరాజు సౌజన్యంతో అన్న ప్రసాదాన్ని దేవస్థానం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

ఆచంట: కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు వేకువజామునే కాలువల్లోనూ, చెరువుల్లోనూ, కార్తీక దీపాలు వెలిగించి అనంతరం శివాలయాలను దర్శించుకున్నారు. ప్రసిద్ధ ఆచంటేశ్వరుని ఆలయంలో వేకువజాము నుంచే భక్తుల స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు చేశారు.

ద్వారకా తిరుమల: క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయాన్ని, పరిసరాలను పూలమాలలతో విశేషంగా అలంకరించారు. గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు అభిషేకాలు జరిపారు. పలువురు మహిళా భక్తులు ఆలయ ఆవరణలోని ఉసిరిచెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. శివ దీక్ష చేపట్టిన శివ స్వాములు, భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది.

కామవరపుకోట: మండలంలోని గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం కొండగట్టుపై గల బౌద్ధారామాల వద్ద కార్తీక సోమవారం నేపథ్యంలో సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు విచ్చేసి ఇక్కడ గల బౌద్ధారామాలను, చైత్యాలను, బౌద్ధ స్థూపాలను తిలకించారు. కొండపై గల ధర్మలింగేశ్వరస్వామికి మహిళలు సంతాన ప్రాప్తికోసం తడి దుస్తులతో ప్రణామ దీక్షలు చేపట్టారు.



ద్వారకాతిరుమలలో శివయ్యకు పూజలు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శివాలయాలు ఓం నమఃశివాయ అన్న శివనామ స్మరణతో మార్మోగాయి. పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు 3000 మందికి భోజనాలు ఏర్పాటుచేశారు. తుఫాను కారణంగా భక్తుల సంఖ్య తగ్గినప్పటికీ తెలంగాణా, ఒడిశా, కర్నాటక నుంచి పలువురు భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. సుమారు 18 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం.



ద్వారకాతిరుమలలో శివయ్యకు పూజలను కనులారా వీక్షిస్తున్న భక్తులు



స్వయంగా పూజలందుకున్న నాగమ్మ!

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో ఓ అద్భుతం జరిగింది. ఓ భక్తుడు తన కుటుంబంతో స్థానిక బాట గంగానమ్మగుడి సమీపంలోని వేపచెట్టు కింద ఉన్న పుట్టలో పాలు పోసి పూజలు చేస్తుండగా పుట్టలోంచి పాము బయటకు వచ్చింది. అక్కడ పూజలు చేసిన భక్తుడు స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి. ఆయనతో పాటు ఇతర భక్తులు కూడా పూజలు చేసేంత వరకు ఆ పాము ఎటూ వెళ్లకుండా అక్కడే వారి పూజలందుకుంది. కార్తీక మాసంలో ఇలా నాగేంద్రస్వామి భక్తుల పూజలందుకోవడానికి స్వయంగా వచ్చాడని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

తమ గ్రామంలోనే పంచాయతీ కార్యాలయం నిర్మించాలని ధర్నా

కొయ్యలగూడెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోనే పంచాయతీ కార్యాలయం నిర్మించాలంటూ కనకాద్రిపురం గ్రామస్థులు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఇటీవల పంచాయతీ భవనం మంజూరైందని అయితే భవనం కుంతలగూడెంలో నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారని భవనాన్ని కనకాద్రిపురంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పంచాయతీ కనకాద్రిపురంలోనే కొనసాగుతున్నందున ఇక్కడే భవనాన్ని నిర్మించాలని కనకాద్రిపురం గ్రామస్థులు కోరుతున్నారు. ఈ భవన నిర్మాణ విషయం కొంత కాలంగా కుంతలగూడెం, కనకాద్రిపురం గ్రామాల మధ్య సమస్యగా నెలకొంది. తమ గ్రామం పేరునే పంచాయతీ ఉన్నందున తమ గ్రామంలోనే పంచాయతీ కార్యాలయం నిర్మించాలని కుంతలగూడెం గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ ఏర్పాటు అయినప్పటి నుంచి కనకాద్రిపురంలో పంచాయతీ కార్యకలాపాలు కొనసాగుతున్నందున తమ గ్రామంలోనే భవనం నిర్మించాలని కనకాద్రిపురం గ్రామస్థులు కోరుతున్నారు. మంగళవారం కుంతలగూడెంలో శంకుస్థాపన చేస్తున్నారన్న ప్రచారంతో కనకాద్రిపురం గ్రామస్థులు నిరసనకు దిగారు.



విద్యుత్ స్తంభానికి మంటలు

భీమవరం క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమవరం మావుళ్ళమ్మ గుడి సమీపంలోని పూరి గుడి వద్ద సోమవారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభానికి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అందరూ కంగారుపడ్డారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడ్డాయి. దానికి తోడు ఆ స్తంభానికి కేబుల్ వైర్లు, నెట్ వైర్లు అధికంగా ఉండటంతో మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. అక్కడున్నవారు హుటాహుటిన విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్ళి మంటలను అదుపు చేశారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

లాడ్జిలో ఒకరి అనుమానాస్పద మృతి

నూజివీడు టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన నూజివీడు వెంకటేశ్వర లాడ్జీలో చోటు చేసుకుంది. విజయవాడ యనమలకుదురుకు చెందిన కపిలవాయి వెంకటరామరాజు(36) ఆదివారం రాత్రి నూజివీడు వెంకటేశ్వర లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు.సోమవారం ఉదయం లాడ్జి సిబ్బంది రూమ్ శుభ్రం చేసేందుకు వెళ్లగా వెంకట రామరాజు తన రూమ్‌లో అచేతనంగా పడిఉన్నాడు. లాడ్జి సిబ్బంది సమాచారాన్ని నూజివీడు పట్టణ పోలీసులకు అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనపరుచుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. కాగా అతని వద్ద ఖాళీ అయిన మందు బిళ్లల కవర్లు ఉండటంతో వైద్యం చేయించుకునేందుకు వచ్చి మృతి చెందాడా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే అంశంపై విచారణ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళాలు బద్దలు కొట్టి ఇంట్లో బంగారం చోరీ



చెల్లా చెదురుగా పడి ఉన్న వస్త్రాలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణం శివాలయం వీధిలో ఇంటి తాళాలు బద్దలు కొట్టి బంగారు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది.తాడేపల్లిగూడెం శివాలయం వీధిలో శాసనాల వేణు గోపాలమ్మ తన మనుమడు అమెరికా నుంచి వచ్చాడని పది రోజుల క్రితం ఆకివీడు కుమార్తె ఇంటికి వెళ్లారు. అయితే సోమవారం ఇంటికి తిరిగి వచ్చే సరికే ఇంటి తలుపులు బద్దలుకొట్టి బీరువాలోని వెండిగిన్నెలు, రెండున్నర కాసుల బంగారు గొలుసు, చెవిదిద్దులు చోరీ చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు వేణుగోపాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. బాదం శ్రీనివాస్ తెలిపారు. రెండేళ్ల క్రితం వేణుగోపాలమ్మ మెడలోని బంగారు గొలుసు గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని పోయాడు. ఆ కేసు కూడా ఇప్పటికీ కొలిక్కి రాలేదని బాధితురాలు వాపోతున్నారు.

అనధికార మద్యం దుకాణాలపై దాడులు

ఏలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న దుకాణాలపై కేసులు నమోదు చేసి, ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 25 లిక్కర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు ఏలూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం స్టేషన్ల పరిధిలో విస్తృతంగా దాడులు చేపట్టామని, ఎక్కడా అక్రమ మద్యం విక్రయాలు జరగలేదన్నారు. ఈ నెలలో గడిచిన 12 రోజుల్లో 711 కేసుల అనధికార మద్యం దుకాణాలపై దాడి చేసి 715 మందిని అరెస్టు చేశామన్నారు. 1584 లీటర్ల ఐఎంఎల్ లిక్క, 94 లీటర్లు బీరు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొనుగోలు చేసిన లారీ ఈఎంఐ బకాయిలు చెల్లించలేక పురుగు మందు తాగిన వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఏలూరు వెంకటాపురం పంచాయతీ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన పిల్లా పెంటయ్య(45) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 2024లో ఫైనాన్స్‌లో ఒక లారీ కొనుగోలు చేశాడు. సరైన కిరాయిలు లేక ఏలూరు చిరంజీవి బస్టాండ్ ప్రాంతానికి చెందిన పెంటకోటు నాగార్జునకు లారీని విక్రయించాడు. నాగార్జున ఆ లారీని ఇతర రాష్ట్రంలో ఉంచి కిరాయిలు తిప్పుతున్నాడు. ఈఎంఐలు చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో నాగార్జున వేధింపులు భరించలేక ఈనెల 25వ తేదీ రాత్రి ఏలూరు కోటదిబ్బ దర్గా వద్ద పెంటయ్య పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న పెద్ద కుమారుడు వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

సోషల్ మీడియాలో కల్పిత పోస్టులు పెడుతున్న వ్యక్తి అరెస్టు

భీమవరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వం మధ్య విభేదాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్న ఒకరిపై కాళ్ల పోలీస్ స్టేషన్‌లో టీడీపీ ప్రధాన కార్యదర్శి మంతెన కోదండ రామరాజు ఫిర్యాదు చేయగా ఈ నెల 26న అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసినట్టు భీమవరం డీఎస్పీ ఆర్.జి.జయసూర్య తన కార్యాలయంలో సోమవారం వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామానికి చెందిన అంబోజీ వినయ్‌కుమార్ ఈ నెల 25న టీడీపీ-జనసేన పార్టీలకు సంబంధించి ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజుపై నకిలీ కల్పిత పోస్టులు పెట్టాడు. దీనిపై ఫిర్యాదు అందడంతో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు భీమవరం డీఎస్పీ జయసూర్య, టూటౌన్ సీఐ కాళీచరణ్, కాళ్ల ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావులు ఈ నెల 26న హైదరాబాద్ వెళ్లారు. అక్కడ పాండురంగ నగర్‌లో ఉన్న అంబోజీ వినయ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. యువకుడిపై గతంలోనూ జగ్గయ్యపేటలో రెండు కేసులు ఉన్నట్టు డీఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

మోటార్ సైకిళ్ల దొంగల ముఠా అరెస్టు

ముదినేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):పలు ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఓ ముఠాను ముదినేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ ముఠా నుంచి లక్షలాది రూపాయల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ సోమవారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముదినేపల్లి మండలం దేవపూడి రోడ్డులో ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు తన సిబ్బందితో సోమవారం ఉదయం వాహనాల తనిఖీ చేస్తుండగా, ముగ్గురు యువకులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అనుమానంతో వెంటాడి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ముదినేపల్లి మండలం ప్రొద్దువాక గ్రామానికి చెందిన యెండూరి జీవన రాజు, విజయవాడ అజిత్ సింగ్ నగర్‌కు చెందిన జలసూత్రం సాయి సురేశ్, మరో బాలుడు బైక్ చోరీలకు పాల్పడుతున్నట్టు తెలిసిందన్నారు. ఇటీవల కాలంలో ఈ ముగ్గురు రూ.11.05 లక్షల విలువైన బైక్‌లను విజయవాడ, తాడేపల్లి, కైకలూరు, ముదినేపల్లి ప్రాంతాల్లో చోరీ చేసి వాటిని ప్రొద్దువాక గ్రామంలో కుర్మా సుధాకర్ వద్ద దాచినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ వీరభద్రరావు పాల్గొన్నారు. నిందితులను పట్టుకుని, సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ చూపిన కైకలూరు సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు, ముదినేపల్లి పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్ల బి.నాగరాజు, శివకోటయ్య, వై.నాగరాజు, పవన్ కుమార్‌లను ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ అభినందించారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

దైవదర్శనానికి వెళ్తే ఇంట్లో దొంగలు పడ్డారు

ఏలూరు క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో దైవదర్శనానికి వెళ్ళి వచ్చే సరికే దొంగలు ఆ ఇంటి తాళాల పగులగొట్టి, ఇంట్లోని బీరువాను, కబోర్డులను కూడా పగులగొట్టి బంగారపు వస్తువులు, వెండి వస్తువులను అపహరించుకుపోయారు.ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ల గ్రామంలో నివాసం ఉంటున్న వెంకట అనంతరామం మొక్కజొన్న సీడ్స్ డీలర్‌గా వ్యాపారం చేస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో సహా ఈనెల 26న రావులపాలెం వెళ్లి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. ఇంట్లోనిఇ బంగారపు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. సుమారు నాలుగున్నర లక్షల విలువైన వస్తువులు అపహరణకు గురైనట్లుగా ప్రాథమికంగా గుర్తించారు. ఈసంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊరు వెళ్తే ఇల్లు దోచేశారు..

ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో ఫంక్షన్‌కు వెళ్తే దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి విలువైన బంగారం, వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5వ రోడ్డులో నివాసం ఉంటున్న తూతి చంద్రశేఖర్ తన కుటుంబ సభ్యుతో హైదరాబాద్ వెళ్ళారు. వారు ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉన్నారు. సోమవారం ఉదయం ఆ ఇంటి తాళలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో బీరువాలు కూడా పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని వస్తువులు కూడా చెల్లాచెదరుగా పడవేసి ఉన్నాయి. వెండి, బంగారపు వస్తువులు, కొంత నగదు అపహరణకు గురైనట్లు భావిస్తున్నారు. సమాచారం పోలీసులకు తెలియజేయడంతో పోలీసులు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలిస్తున్నారు. మరోవైపు తూతిక చంద్రశేఖర్ హైదరాబాద్ నుంచి బయల్దేరారు.

మోటార్ సైకిల్ ఢీకొని ఒకరి మృతి



ఇజ్రాయేల్(ఫైల్)

ఏలూరు క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని మోటార్ సైకి ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ముసునూరు మండలం వేల్పు చర్ల గ్రామానికి చెందిన కందుల ఇజ్రాయేల్ (35)కు భార్య బాల, పిల్లలు ఉన్నారు. ఉప్పు, ముగ్గు అమ్ముతూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. కొద్ది నెలల క్రితం హనుమాన్ జంక్షన్‌కు కుటుంబంతో సహా వెళ్లి అక్కడ నివా సం ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం ఏలూరు మెయిన్ బైపాస్ రామచంద్ర ఇంజ నీరింగ్ కాలేజీ వద్ద రోడ్డుపై నడిచి వెళ్తున్న అతడిని ఆశ్రం నుంచి విజయవాడ వైపు వెళ్లే మోటారు సైకిలిస్టు బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఇజ్రా యేల్‌ను నేషనల్ హైవే అథార్టీ ఆఫ్ ఇండియా అంబులెన్సు సిబ్బంది ఏలూరు ప్ర భుత్వాసు పత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రి అత్యవసర విభాగపు వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఒకరికి 14 రోజుల రిమాండు

భీమడోలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భీమడోలులో భార్య, భర్తల ఆత్మహత్యాత్నం కేసులో భార్య మిస్సింగ్ కేసులో నిందితుడైన కఠారి మోహన్‌కు పద్నాలు రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. వివాహేతర సంబంధం కేసులో భీమడోలు గ్రామానికి చెందిన గుండుమోలు సుధాకర్ ఇతడి భార్య భాను పూర్ణిమలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే..ఈ కేసుకు సంబంధించి ఈ నెల 7న భర్త సుధాకర్ భాను పూర్ణిమ కనిపించడం లేదని ఇందుకు కఠారి మోహన్ కారణమంటూ భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భానుపూర్ణిమ వాంగ్మూలం తీసుకున్న పోలీసులు నిందితుడు కఠారి మోహన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

14 కాసుల బంగారం చోరీ

భీమవరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వివాహానికి వెళ్లి తిరిగి వచ్చి ఇంట్లో మంచంపై ఉంచిన బ్యాగును గుర్తు తెలియని దుండగులు దోచుకుపోయారు.దీనికి సంబంధించి టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యనారాయణ పురానికి చెందిన కొమ్మన శ్రీనివాసరావు కుమార్తెకు ఇటీవల వివాహం చేశారు. వారు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ నెల 26న భీమవరం తండ్రి నివాసానికి వచ్చారు. తన దగ్గర ఉన్న హ్యాండ్ బ్యాగును మంచంపై ఉంచి నిద్రపోయారు. ఉదయం లేచి చూసేసరికే బ్యాగు లేదు. అందులో 14 కాసుల బంగారు వస్తువులు, మూడున్నర కేరట్ల డైమండ్ కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాబోయే మూడ్రోజులు అప్రమత్తంగా ఉండాలి

నిడమర్రు అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.విక్టర్ పేర్కొన్నారు. సోమవారం నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తుఫాన్ రక్షణ టీమ్ సభ్యులకు పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించడం, ప్రమాదాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయడంపై చర్చించారు. రాబోయే మూడ్రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నా. ఎంపీడీవో విజయకుమారి, తహసీల్దార్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అవినీతి నివారణపై అవగాహన

ఏలూరుటూటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 27 నుంచి నవంబరు 2వ తేదీ వరకు జరిగే సెంట్రల్ విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను జిల్లా కార్యదర్శి శేఖర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు మాట్లాడుతూ నీతి వంతమైన సమాజంపై ప్రజల్లో అవగాహన పెంచడం కోసం ప్రతి ఏటా అవినీతినివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎల్.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : ఎంపీ


సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ పుట్టా

ఏలూరుటూటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. ఎంపీ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పేదలు వైద్యం కోసం సీఎం సహాయ నిధి చెక్కులు రూ.50 లక్షలు పంపిణీ చేశామన్నారు. 68 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇచ్చామన్నారు. వర్షం పడుతున్నా ఎంతో మంది జిల్లా నలుమూలల నుంచి వచ్చి ఎంపీ మహేశ్‌కు ప్రజా సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

3 నుంచి సమ్మెకు ఏఐటీయూసీ పిలుపు


ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నగర పాలక సంస్థల్లో, పురపాలక సంఘాల్లో, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బంది ది సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ నవంబరు 3వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్టు ఏఐటీయూసీ నాయకులు ఎ. అప్పలరాజు, రెడ్డి శ్రీనివాసడాంగే, బండి వెంకటేశ్వరరావులు ప్రకటించారు. సోమ వారం రామచంద్రరావుపేటలోని సర్వీసు రిజర్వాయర్ వద్ద ఆందోళన నిర్వహించా రు. ఈ నెల 29,30 తేదీల్లో వడ్డేశ్వరం వద్ద ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షల్లో ఏలూరుకు చెందిన ఇంజనీరింగ్ ఉద్యోగ సిబ్బంది పాల్గొనాలని పిలుపునిచ్చారు. 31న ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్స వాన్ని ఏలూరు నగరంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. యూనియన్ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, డి.వెంకటేశ్వరరావు, బి.నారాయణరావు, నారా శ్రీని వాస్, కె.బాలకిషోర్, ఎస్.వెంకన్న, జి.రవి, కె.సాంబశివరావు, సి.హెచ్.అప్పారావు, ఎ.రాంబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో అవకతవకల్లో ఏడీసీపై ఆరోపణలు సరికాదు

ఏలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో పరిధిలో పెట్రోల్ బంకులో ఆర్థిక అవకతవకల నేపథ్యంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఏడీసీపై ఆరోపణల విషయంలో అన్యాయం జరుగుతోందని రాష్ట్ర కార్మిక వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు దేవరపల్లి రత్నబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ త్వరలో ఉన్నతాధికారులను కలిసి వివిధ బహుజన సంఘాల ఆధ్వర్యంలో కలిసి పూర్తి స్థాయిలో వివరాలు నివేదిస్తామన్నారు. అనధికారికంగా విధుల నుంచి దూరంగా ఉంచుతున్న ఏడీసీని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గ్యారేజీలో పనిచేసిన ఈయనకు సంబంధం లేని విధులు అప్పగించారని, ఆయనకు జరుగుతున్న అన్యాయం, ఆరోపణలపై లీగల్‌గా చర్యలు తీసుకోవడానికి సిద్ధపడటాన్ని తాము ఖండిస్తున్నామన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు వాయిదా

టి.నర్సాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురంలో ఈ నెల 27, 28, 29తేదీల్లో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నవంబరు 4, 5, 6 తేదీలకు వాయిదా వేసినట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. జీవరత్నం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభల తేదీల మార్పును వ్యవసాయ కార్మికులు, నాయకులు గమనించాలని ప్రకటించిన తేదీల్లో జరిగే మహాసభలు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి

టి.నర్సాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర గృహ నిర్మాణ, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి కోరారు. విజయవాడలోని వారి నివాసంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు సోమవారం తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. సమాజంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యవారధిగా ఉండే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరినట్టు తెలిపారు.


జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలో నేల వాలినా వరి పంట

వరి రైతుల్లో ఆందోళన.. నేలకొరిగిన పంట

ఏలూరు రూరల్/జంగారెడ్డిగూడెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికలతో మండలంలోని వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించిన అన్నదాతకు ఈ ఏడాది కూడా కష్టాలు తప్పడం లేదు. పంటలు ఏపుగా పెరిగాయి. కొద్ది రోజుల్లో కోతలు ప్రారంభమవుతాయి. ఈసారి దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని అంతా భావించారు. పొట్ట, వెన్ను దశలో ఉన్న వరి నేలవాలడంతో అన్నదాతలు బిక్కుబిక్కుమంటున్నారు. ఏలూరు రూరల్ మండలంలో సుమారు 16వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. జంగారెడ్డిగూడెం మండలంలో సైతం పంటలు భారీ వర్షాలకు నేలకొరుగుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

హై అలర్ట్

(5వ పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రత్యే కాధికారి కాంతిలాల్ దండే అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 301 మైనర్ ఇరిగేషన్ చెరువులు సమస్యాత్మకం కాగా 129 మైనర్ ఇరిగేషన్ చెరువులు ప్రమాదకరమైనవిగా గుర్తించామన్నారు. ప్రమా దానికి మించిన నీటి ప్రవాహం వస్తే గండి కొట్టే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 763 హోర్డింగ్‌లు తొలగించామని, వంద మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. 123 మంది గర్భిణులను ప్రభుత్వాస్పత్రులకు తరలించామన్నారు. కలె క్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ని 13 మండలాల్లో పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 14 మండలాల్లో హైఅలర్ట్ ప్రకటించామన్నారు. తుఫాన్ సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, జిల్లా యంత్రాంగంతో సహకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. తుఫాన్ సహాయక చర్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులతో సమీక్షించారు. తుఫాన్ ముగిసే వరకు మండల, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో ఉండి సహాయక చర్యలు పర్యవేక్షించాలని ఆదేశించారు. తుఫాన్ సహాయక కేంద్రాలలో భోజన, వసతి సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

నేటి నుంచి చౌకడిపోల్లో నవంబరు నెల రేషన్ పంపిణీ

ఏలూరుసిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):తుఫాన్ ప్రభావంతో రేషన్ దుకాణాల ద్వారా నవంబరు నెల నిత్యావసరాల పంపిణీ మంగళవారం నుంచి రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయనున్నట్టు జేసీ అభిషేక్ గౌడ సోమవారం తెలిపారు. ప్రతి రేషన్ కార్డుదారులు తమ నిత్యావసరాలు రేషన్ షాపుల ద్వారా పొందవచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమయానికి సరుకులు పొందాల్సిందిగా ఆయన కోరారు.


కొణికి గ్రామంలో పర్యటిస్తున్న డీపీవో అనూరాధ


దెందులూరులో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ విజయరాజు


ప్రజలను తరలిస్తున్న ద్వారకాతిరుమల అధికారులు


జల్లేరు కొండవాగును పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

తస్మాత్.. జాగ్రత్త

ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు - తుఫాన్ జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

పెదపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముంపు బారినపడే అవకాశమున్న గ్రామాల ప్రజలు, వారి రక్షణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారి, డీపీవో అనూరాధ సూచించారు. పెదపాడు మండలంలో ముంపునకు గురయ్యే కొణికి, వడ్డిగూడెం, రాళ్లపల్లివారిపాలెం, కడిమికుంట తదితర గ్రామాలతో పాటుగా కొల్లేరు పరిసరాల్లోని ప్రాంతాలను, మండలంలోని పలు గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న రామిలేరు, బుడమేరు, వయ్యేరు కాలువలను,అక్కడి పరిస్థితులను డీపీవో అనూరాధ సోమవారం తహసీల్దారు కృష్ణజ్యోతితో కలిసి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో వరద నివారణా చర్యలపై సమీక్షించారు.వరద ప్రభావిత ప్రాంత రైతులు విధిగా పశువులకు మూడ్రోజులకు తగ్గకుండా దాణా, పశు గ్రాసం ఏర్పాటు చేసుకోవాలన్నారు. అధికారులు చేపట్టే రక్షణ చర్యలకు ప్రజలు తగిన విధంగా సహకరించాలని డీపీవో అనూరాధ కోరారు.

● చింతలపూడి:మొంథా తుఫాన్‌ను ఎదుర్కోవడానికి అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సూచించారు. ప్రజలు తుఫాను సమయాల్లో ఇళ్లల్లోనే ఉండాలని, నిరాశ్రయులకు అధికారులు షెల్టర్, వైద్య సహాయం, ఆహారం అందించాలన్నారు. తుఫాన్ కారణంగా అధిక వర్షాల వలన నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, ఏరియా ఆసుపత్రి వైద్యులు, విద్యుత్ శాఖ, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు.అధికారుల నుంచి సహాయం అందకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తహసీల్దార్ స్లీవజోజి, మునిసిపల్ కమిషనర్ అంబటి రాంబాబు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఎస్ఐ సతీశ్‌కుమార్ తమ్మిలేరు ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.

● దెందులూరు: మండలంలో మొంథా తుఫాన్ వల్ల ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైన తక్షణ సహాయ చర్యలు చేపట్టడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని డీఆర్డీఏ పీడీ, దెందులూరు మండల ప్రత్యేక అధికారి విజయరాజు అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ బత్తుల సుమతి, ఎంపీడీవో భీమరాజు అన్ని మండల శాఖ అధికారులతో తుఫాన్ పట్ల సమీక్షించారు. మండల కేంద్రంలో ముందస్తు చర్యల్లో భాగంగా రెండు యంత్రాలను అందుబాటులో ఉంచారు. ప్రజలను సైతం అలర్ట్ చేస్తున్నారు.

● ద్వారకాతిరుమల:మొంథా తుఫాన్ ప్రభావంతో ముందస్తు చర్యల్లో భాగంగా ద్వారకాతిరుమలలో లోతట్టు ప్రాంతాల్లో నివాసముంటున్న నాలుగు కుటుంబాలను సోమవారం పునరావాస కేంద్రానికి తరలించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశాల మేరకు వారిని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తరలించారు. వారికి శ్రీవారి దేవస్థానం ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు.మండల ప్రత్యేక అధికారి ముక్కంటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● బుట్టాయగూడెం: ఏజెన్సీలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్టు ఆర్డీవో ఎం.వి.రమణ తెలియజేశారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం ఆర్డీవో ఏజెన్సీలో పర్యటించారు. రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు కొండవాగుపై నిర్మించిన కల్వర్టును పరిశీలించారు. ఇతర ప్రాంతాల్లో కొండవాగులపై నిర్మించిన వంతెనలను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంగళవారానికి తుఫాన్ తీవ్రత అధికమయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.తహసీల్దార్ పి.వి.చలపతిరావు సిబ్బంది ఉన్నారు.

● భీమడోలు: భీమడోలు మండలంలో తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలో వరి సాగు స్వర్ణ రకం సుమారు 158 ఎకరాలు నేలకొరిగింది. మండల వ్యాప్తంగా 12,600 ఎకరాల్లో వరిసాగులో 90శాతం పీఎల్‌రకం సాగవుతోందని ఈ రకం వరికి భారీనష్టం వాటిల్లే ప్రమాదం ఉండదని ఏడీఏ ఉషారాజకుమారి తెలిపారు. అంబర్‌పేటలో నేలకొరిగిన స్వర్ణ సాగును పరిశీలించారు. ఏవో ఉషారాణి పాల్గొన్నారు. అలాగే కొల్లేరు ప్రాంతాలైన మల్లవరం, చెట్టున్నపాడు, ఆగడాలలంక గ్రామాల్లో ప్రత్యేక అధికారి నాగరాణి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో పద్మావతిదేవి పర్యటించారు. కొల్లేరు గ్రామాల్లో ప్రస్తుతం సాధారణ పరిస్థితులే నెలకొన్నాయన్నారు.

● జంగారెడ్డిగూడెం:ప్రభుత్వ హెచ్చరికల ప్రకారం మొంథా తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి.రమణ సూచించారు. సోమవారం మండలంలోని పంగిడిగూడెం-రాజవరం రహదారిలో ఉన్న ఎర్రకాలువ కాజ్‌వేను ఆర్డీవో ఎం.వి.రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ స్లీవజోజి మండలంలోని లక్కవరంలోని ఎర్ర కాలువ ఉధృతిని పరిశీలించారు. సివిల్ సప్లై డీటీ వెంకటేశ్వరరావు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

● ఏలూరుటూటౌన్: తుఫాన్ ప్రభావిత పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి, నగర పాలక సిబ్బంది అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ నగరంలోని వన్‌టౌన్, టూటౌన్‌లో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇడా చైర్మన్ శివ ప్రసాద్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకట రత్నం, అడిషనల్, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్, శివారెడ్డి, ఎంఈ సురేంద్రబాబు పాల్గొన్నారు.


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

● పెదవేగి: పెదవేగి మండల తహసీల్దారు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో పెదవేగి మండల ప్రత్యేకాధికారి, వికలాంగ సంక్షేమ శాఖ ఏడీ రామ్‌కుమార్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించే దిశగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. తహసీల్దారు ఎస్డీ.భ్రమరాంబ, ఎంపీడీవో కె.రవికుమార్, ఎస్ఐ కె.రామకృష్ణ, ఎంఈవో అరుణ్ కుమార్, ఆర్ఐ కేబీవీ.సారథి పాల్గొన్నారు.

● లింగపాలెం: తుఫాన్ నేపథ్యంలో మండలంలో అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ నజీముల్లాషా కొణిజర్లలోని బలహీనంగా ఉన్న చెరువు గట్లను పరిశీలించారు.మండలంలోని ప్రతి గ్రామంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

● జీలుగుమిల్లి: మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి. రమణ అన్నారు. పి.అంకంపాలెం సమీపంలో రహదారికి ఆనుకుని ఉన్న చెరువును ఆర్డీవో పరిశీలించారు. జాగ్రత్తలపై తహసీల్దారు ఉదయ్ భాస్కర్, ఎస్.ఐ. వి.క్రాంతికుమార్‌తో చర్చించారు.జీలుగుమిల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.




పత్తేబాద, ఆదివారపు పేటలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, భీమడోలులో స్వామికి హారతి

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

పెదపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెదపాడులోని శ్రీగంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయం, అప్పన వీడులోని అభయాంజనేయస్వామి దేవాలయం, వట్లూరులోని శివాలయాలతో పాటుగా పలుచోట్ల సోమవారం తెల్లవారు జాము నుంచే కార్తీక పూజలు నిర్వహించారు.

● ఏలూరు కార్పొరేషన్: కార్తీక మాసంలో ఉసిరి చెట్టు వద్ద దీపారాధన చేసి వనభోజనాలు నిర్వహిస్తే ఎంతో పుణ్యం ప్రాప్తిస్తుందని గంగా పార్వతీ సమేత రేవులింగేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకులు వీరుభోట్ల వెంకటేశ్వరరావు శర్మ తెలిపారు. కార్తీకమాసంలో శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి ఇద్దరూ ఉసిరి చెట్టు కింద కొలువై ఉంటారన్నది విష్ణు పురాణ కథనం. ఏది సకల మానవాళిని రక్షిస్తుందని విశ్వసిస్తారని చెప్పారు. వృద్ధాప్యాన్ని దరిచేరనివ్వని ఔషధ మొక్కల్లో ఉసిరికి ఉసిరే సాటి అని చెబుతుంది.

● ఏలూరుకార్పొరేషన్: కార్తీక మాసంలోని తొలి సోమవారం కావడంతో నగరంలోని పలు డివిజన్లలో గల శివాలయాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించి ఆరాధించారు. కార్తీక మా సంలో మిగిలిన రోజుల కంటే సోమవారం చేసే కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం, విశేష ఫలితాలు ఉంటాయన్నది భక్తుల నమ్మకం.

● ఏలూరు రూరల్: కార్తీక మాస పర్వదినం పురస్కరించుకుని బ్రహ్మముహూర్తంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగాభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తీక సోమవారం ఏలూరు రూరల్ మండలంలోని మాదేపల్లిలో ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల్లో తెల్లవారు జాము నుంచే భక్తులు ఒత్తులు వెలిగించి పూజలు చేశారు.

● భీమడోలు: కార్తీక మాసం తొలి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భీమడోలు, గుండుగొలను, పోలసానపల్లి, అంబరుపేట గ్రామాల్లోని ఆలయాల్లో స్వామి వారికి భక్తులు సామూహిక పూజలు, కుంకుమార్చనలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు.

● పెదవేగి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మొదటి సోమవారం పెదవేగి శివాలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాభిషేకం జరిపిన ఆలయ అర్చకులు సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకుడు తిప్పాభట్ల సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో పూజలను వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ పాల్గొని పూజలు నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెంలో ఉన్న శ్రీమద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష తమల పాకుల పూజ నిర్వహించినట్లు ఈవో ఆర్.వి.చందన తెలిపారు. సోమవారం స్వామికి వివిధ రూపాల్లో రూ.1,35,420 ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు. కార్తీక మాసంలో మొదటి సోమవారం సందర్భంగా సుమారు మూడు వేలకు పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారని తెలిపారు.

ప్రపంచ ఆక్యుపేషనల్ థెరపీడే

ఏలూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏలూరు దొండపాడులో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ స్పెషల్ డి.ఎడ్. కాలేజీ ప్రాంగణంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సహకారంతో సోమవారం ప్రపంచ ఆక్యుపేషనల్ థెరపీ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆటిజం, స్ట్రోక్, అభివృద్ధి జాప్యాలు వంటి విస్తృత శ్రేణి పరిస్థితులతో బాధపడుతున్న వ్యక్తులతో ఆక్యుపేషనల్ థెరపిస్ట్ పని చేస్తారన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం, స్పెషల్ డి.ఎడ్. కాలేజీ సిబ్బంది, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

ముగిసిన పీఎంశ్రీ పాఠశాలల శిక్షణ

దెందులూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం ద్వారా విద్యావ్యవస్థను మెరుగుపరచడానికి నాణ్యమైన విద్యను అందిస్తుందని కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శర్మ అన్నారు. ఐదు రోజులుగా కొవ్వలి హైస్కూల్ విద్యార్థులకు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లీడర్ షిప్ క్వాలిటీపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నతంగా తయారవడానికి శిక్షణ అవసరమన్నారు.విద్యా కమిటీ చైర్మన్ గణేష్ కుమార్, కోఆప్షన్ నెంబర్ కసుకూర్తి రామకృష్ణ, ప్రసాద్, ధనలక్ష్మి, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, దుర్గారాణి, సౌజన్య ఉన్నారు.

చిన్నపాటి జల్లులతో మొదలై..

పెదవేగి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో పెదవేగి మండలంలోని పలుగ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. ఉదయం నుంచి మబ్బులతో కూడిన వాతారణం ఉండగా మధ్యాహ్నం నుంచి చిరుజల్లులతో ప్రారంభమయ్యి సాయంత్రానికి మరింత పెరిగింది. పెదవేగి తహసీల్దారు డి.భ్రమరాంబ, ఎంపీడీవో కె.రవికుమర్, ఎస్ఐ కె.రామకృష్ణ ఆయా గ్రామాల్లో పర్యటించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. లోతట్టు ప్రాంతంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ వర్షాలతో పలు గ్రామాల్లో కూరగాయల పాదులకు నష్టం ఉంటుందని ఏవో శ్రీనివాసరావు చెప్పారు.

● ఏలూరు సిటీ : మొంథా తుఫాన్ ప్రభావంతో ఏలూరు నగరంలో సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షాలు మొదలయ్యాయి. అన్ని ప్రాంతాల్లో తుఫాన్ వాతా వరణం కనిపిస్తోంది. అప్పటి వరకు మబ్బులతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయి జల్లులు పడ్డాయి.

ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జనార్దనరావు



ఏలూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవే తమ లక్ష్యమని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్)రాష్ట్ర కార్యదర్శి మద్దుల జనార్దనరావు అన్నారు. ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఏలూరుకు చెందిన మద్దుల జనార్దనరావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు డా.కోనా శ్రీనివాసరావు నియమించారు. నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు అవసరమయ్యేలా ఐవీఎఫ్ సేవా కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తోందన్నారు. పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు జనార్దన్‌రావుకు అభినందనలు తెలిపారు.


బుక్‌లెట్ విడుదల చేస్తున్న నతానియేల్

హాకీ క్రీడాకారులకు వర్క్‌షాపు

దెందులూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు నిబంధనలు తెలుసుకుంటూ పట్టుదలతో రాణించాలని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేల్ అన్నారు. సోమవారం గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో హాకీ క్రీడపై వర్క్‌షాపును నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా ఫార్మర్ ఇంటర్నేషనల్ ప్లేయర్‌లు నక్కపల్లి రంజిత్, దాస్‌లు క్రీడకు సంబంధించి నిబంధనలు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. పోలిరెడ్డి, పతాంజలి, జయశ్రీ ఉన్నారు.

పశు పోషకులు జాగ్రత్తలు వహించాలి

ఏలూరు టూటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల సమయంలో పశు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.గోవిందరాజులు తెలిపారు. పశువులకు వేసే మేత తడిచిపోకుండా జాగ్రత్త వహించాలన్నారు. దాణ తడిస్తే బూజుపడుతుం దన్నారు. వర్షంలో పశువులను బయటకు తోలుకెళ్లకుండా ఇళ్లలోనే ఉంచుకోవాలన్నారు. భారీ వర్షాలకు గోడలునాని కూలిపోయే అవకాశం ఉందన్నారు. పశువులు అతిగా తడిస్తే శరీర ఉష్ణోగ్రత తగ్గిపోయి జబ్బున పడే అవకాశం ఉందన్నారు. దూడలు,గొర్రెల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

25వ రోజుకు చేరిన నిత్య భిక్ష

కామవరపుకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న స్వాములకు నిత్య భిక్ష కార్యక్రమం సోమవారం 25వ రోజుకు చేరింది. తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథిబాబు, మాజీ ఎంపీపీ మద్దిపోటి సుబ్బలక్ష్మి నాగేశ్వర రాంబాబు, ఘంటా సత్యంబాబు బృందం భక్తులకు సేవలందించారు.


ఏలూరు, పెదవేగిలో కురుస్తున్న వర్షం

400 మందికి వైద్య పరీక్షలు

చింతలపూడి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్, సన్‌లైఫ్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, సభ్యులు రామకృష్ణ, సి.హెచ్.అబ్బయ్య, జె.రాము, కె.కేశవరావు, కె.నెహ్రూ, గాంధీ సేవలందించారు.

వేరుశనగ రైతులకు జాగ్రత్తలు

చింతలపూడి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో వేరుశనగ పంట విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. వేరుశనగ పంట కాయ ఏర్పడే దశ నుంచి పంట తీసే దశ వరకు రైతులు తమ చేలల్లో అవసరం మేరకే నీటిని ఉంచాలన్నారు.

సమాధుల తోటను శుభ్రపరచండి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సమాధుల పండుగ నవంబరు 2న నిర్వహించనున్న నేపథ్యంలో బరియల్ గ్రౌండ్‌ను శుభ్రం చేయాలని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఫ్లాష్ టీమ్ ఆధ్వర్యంలో సోమవారం వంగాయిగూడెం క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్స్‌లో ఏపుగా పెరిగిన తుమ్మచెట్లను తొలగించారు. ఎమ్మెల్యే చంటి పాల్గొని స్మశానవాటికలో తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.



ఎండిన వృక్షం తొలగింపు

ద్వారకాతిరుమల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రత నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని రామశింగవరంలో రహదారి పక్కనే ఉన్న పెద్ద ఎండిన వృక్షాన్ని విద్యుత్ సిబ్బంది తొలగించారు. ఈ ఎండిన చెట్టు విద్యుత్ వైర్ల పక్కనే ఉండటంతో పాటు అది గ్రామంలో ఉండటంతో గాలులకు ఎక్కడ పడిపోతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ తీవ్రత దృష్ట్యా ముందుగానే గుర్తించి లైన్‌మన్ లక్ష్మణరావు టీమ్ దాన్ని చాకచక్యంతో తొలగించారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

నేడు ముదినేపల్లిలో ఎంపీ పర్యటన రద్దు

ముదినేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో మంగళవారం జరగాల్సిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ పర్యటన రద్దయినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి తెలిపారు. తుఫాన్ కారణంగా ఎంపీ పర్యటన రద్దయిందని తెలిపారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

కలిదిండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముంపు ప్రాంతాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పడమటిపాలెంలో బంకు కాలనీలో ముంపు బాధితులను కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలిస్తున్నారు. ఉప్పుటేరు గ్రామాల్లో పూరిగుడిసెల్లో నివశించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎప్పటికప్పుడు తుఫాన్ హెచ్చరికలను మైకులో ప్రచారం చేస్తున్నారు.

కూలిన వంతెనను పరిశీలించిన ఎస్పీ



కలిదిండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో లాల్వ డ్రెయిన్‌పై కూలిన వంతెనను జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తు నిర్వహణ కార్యక్రమాలు, విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి.నరసయ్య, ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర, తహసీల్దార్ రామకృష్ణ, సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కలిదిండి పోలీస్ స్టేషన్ సందర్శించి ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు పలు సూచనలు చేశారు.

ముందస్తుగా ముంపు నివారణ చర్యలు



గోపవరం రోడ్డులోని పుల్లవ డ్రైన్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి, ఎంపీడీవో

కైకలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో కైకలూరు నియోజకవర్గంలో ముంపు నివారణ చర్యలు అధికారులు ఎక్కడికక్కడే చేప ట్టారు. సోమవారం కైకలూరులో డ్రెయిన్లో చెత్త తొలగింపు పనులు నిర్వహించి నీటి ప్రవాహానికి అవరోధం లేకుండా చర్యలు తీసుకున్నారు. గతంలో కురిసిన వర్షపునీరు కైకలూరు వెలమపేట కాలనీ, వెలమపేట తదితర ప్రాంతాల్లో మోటార్లు ఏర్పాటుచేసి నీటిని బయటకు తరలించారు. గ్రామాల్లో ఎక్కడా నీరు నిలవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. తుఫాన్ పర్యవేక్షణ నిమిత్తం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జితేంద్రను కైకలూరు మండలానికి ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆయనతో పాటు ఎంపీడీవో ఆర్ రాజబాబు, డిప్యూటీ ఎంపీడీవో అప్పారావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కైకలూరు పుల్లవ డ్రెయిన్లో, గోపవరం రోడ్డులో వంతెన వద్ద ఎక్స్‌కవేటర్లతో నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న చెత్తను తొలగించారు.

చెరువుకు గండి పడకుండా చర్యలు



జనార్దనవరంలో చెరువు కట్టను పటిష్టం చేస్తున్న దృశ్యం

చాట్రాయి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు మండలంలోని జనార్దనవరం గ్రామంలో రామయ్య చెరువు(కొత్తచెరువు) కట్ట తెగే పరిస్థితి ఏర్పడటంతో నాయకులు అప్రమత్తతతో కట్టను మట్టితో పటిష్టం చేసి గండి ముప్పును నివారించారు. చెరువు పరిస్థితి గురించి మంత్రి పార్థసారధికి సమాచారం ఇవ్వటంతో ఆయన ఆదేశాల మేరకు నీటి సంఘం అధ్యక్షుడు వంగల సుబ్బారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మాదాసు చిన్న పుల్లయ్య సొంత నిధులతో కట్టను పటిష్టం చేయటంతో పాటు, చెరువు కట్టపైన ఉన్న తుప్పలను తొలగించి రైతుల రాకపోకలకు అనువుగా మార్చారు. నాయకులు బలుసూరి రత్తయ్య, పుచ్చకాయల వెంకటేశ్వరరెడ్డి, తిరుపతరావు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో ఇంటి వద్దకే పౌష్టికాహారం

ముసునూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ వల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు మూడు రోజులు పాటు సెలవులు ప్రకటించడంతో అంగన్‌వాడీలు చిన్నారులకు, గర్భవతులు, బాలింతలకు వారి ఇళ్ళకు వెళ్ళి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. సోమవారం చింతలవల్లిలో పంచాయతీ కార్యదర్శి నీరజ, అంగన్‌వాడీ కార్యకర్త రాజకుమారి, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు చేపట్టామన్నారు. అలాగే ప్రసవానికి దగ్గరలో ఉన్న గర్భవతులను సైతం ఆసుపత్రుల్లో చేర్పించామన్నారు. వైద్య సిబ్బందితో బాలింతలకు, చిన్నారులకు అవసరమైన వ్యాక్సిన్‌లు, వైద్య సేవలను అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సూపర్‌వైజర్ తెలిపారు.

నేలకొరిగిన వరి పైరు పరిశీలించిన జేడీ



ముదినేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా సార్వా వరిపైరు దెబ్బతినకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాష తెలిపారు. వర్షాలు, గాలులకు ముదినేల్లి మండలం పెదకామనపూడి గ్రామ పరిధిలో నేలకొరిగిన సార్వా వరి పైరును ఆయన సోమవారం ఏడీఏ వెంకట మణి, ఏఓ వేణుమాధవ్‌తో కలిసి పరిశీలించారు. పొలాల నుంచి వర్షపు నీరు బయటికి పోయే మార్గాలను ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు.

కైకలూరు: తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోకుండా రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌భాషా సోమవారం వింజరంలో పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈదురుగాలులకు పంట నేలకొరిగితే దుబ్బులను నిలబెట్టి కట్టలుగా కట్టి 5శాతం ఉప్పుద్రావణాన్ని పంటలపై చల్లాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి దివ్య తదితరులు పాల్గొన్నారు.

వేటకు వెళ్లవద్దు : ఎమ్మెల్సీ జయమంగళ


కైకలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుపాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. సోమవారం కొల్లేరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. వాతావరణ పరిస్థితులను ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, అధికారుల సూచనలను పాటించాలన్నారు. తుపాన్ ఉధృతిని ఎప్పటికప్పుడు మైక్‌లో ప్రచారం చేసి అవగాహన కల్పించాలన్నారు. మంగళవారం ఈదురు గాలులు, భారీవర్షం కురుస్తుందని ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు.

'అదానీ నుంచి ఎల్ఐసీ సొమ్ము వసూలు చేయాలి'

నూజివీడు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలోని ప్రజల సొమ్మును కేంద్రం ప్రముఖ కార్పొరేట్ సంస్థ అయిన అదా నీ కంపెనీకి పెట్టుబడిగా ఇవ్వడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన, అనం తరం ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ అదానీకి ఇచ్చిన ఎల్ఐసీ సొమ్మును తక్షణం రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. నిమ్మగడ్డ నరసింహ, పుల్లారావు, మడుపల్లి నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280



నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

అత్యవసరమైతేనే బయటకు వెళ్లండి

» ప్రజలకు సబ్ కలెక్టర్ వినూత్న సూచన

» తుఫాన్‌ను ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అత్య వసరమైతే తప్ప ఇళ్ళ నుంచి బయటకు రావద్దని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న సూచించారు. సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మొంథా తుపానుపై ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకునే అంశంపై సమీక్షా సమావేశం, అనంతరం విలేకర్లతో సమావేశమై మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో గంటకు వంద కిలోమీటర్ల వేగంగా గాలులు వీయడంతో పాటు భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలన్నారు. డివిజన్ పరిధిలో ఇప్పటివరకు విస్తారంగా పడిన వర్షాలకు చెరువులు పూర్తిగా నిండాయన్నారు. భారీవర్షాలకు చెరువుల గట్లు ఓవర్ ఫ్లో అయ్యే ప్రమాదం ఉందని, వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. నూజివీడు డివిజన్ పరిధిలో నెల రోజుల్లోపు ప్రసవించే గర్భిణులు సుమారు 355 మందిని ముందుగా ఆసుపత్రులకు తరలించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చర్యలు చేపడుతున్నారన్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉన్న నేపధ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం నిషేధాజ్ఞలు ఉల్లంఘించకూడదన్నారు. తుఫాన్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.

కైకలూరు: తుపాన్ నేపధ్యంలో ప్రజలంతా ఇళ్ల వద్దే సురక్షితంగా ఉండాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. సోమవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్నిశాఖల అధికారులతో తుపాన్‌పై సమీక్షా సమావేశాన్ని మండల ప్రత్యేక అధికారి జితేంద్ర అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ దూర ప్రాంతాలకు ప్రయాణాలను నిలుపుదల చేయాల న్నారు. గ్రామాల్లో సెల్‌టవర్ల వద్ద జన రేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తుపాన్ ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూంలను ఏర్పాటుచేశారు. చిన్న ప్రమాదం జరిగినా తక్షణమే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. కొల్లేరు గ్రామాల్లో మత్స్యకారులను వేటకు వెళ్లకుండా నిరోధించాలన్నారు. తుపాన్ ప్రభావంతో భారీగా ఈదురు గాలులు వీస్తాయని కరెంటుతీగలు, సెల్ టవర్లు, చెట్లకింద, నిర్మానుష్య ప్రదేశాల్లో ప్రజలెవ్వరూ ఉండకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలు వచ్చినా మంచినీటికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కైకలూరు మండలంలో హై అల ర్ట్‌గా భుజబలపట్నం, ఆలపాడు, కొట్టాడ గ్రామాలను ప్రకటించారు. ఈ గ్రామాల్లో తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. తహసీల్దార్ ఆర్. రామకృష్ణారావు, ఎంపీడీవో ఆర్ రాజబాబు, టౌన్ సీఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ఎదుర్కోవాలి : జడ్పీ సీఈవో

ముదినేపల్లి: మొంథా తుఫాన్ వల్ల ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టాలు జరుగకుండా అన్ని శాఖల అధికార్లు, సిబ్బంది సమష్టిగా కృషి చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని ఏలూరు జడ్పీ సీఈవో ఎం శ్రీహరి అన్నారు. ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తుఫాను ప్రభావిత అంశాలపై మండల, పంచాయతీ అధికార్లతో నిర్వహించిన సమావేశంలో సీఈవో మాట్లాడుతూ గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను ముందుగా సురక్షిత భవనాలను గుర్తించాలన్నారు తహసీల్దార్ లతీఫ్ పాషా, మండల ప్రత్యేక అధికారి యోహాను, ఎంపీడీవో వై. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ దాసరి ప్రశాంతి, నూజివీడు సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఎం.చిరంజీవి సూచించారు. ప్రమాదకరంగా ఉన్న చెక్కపల్లి పెద్ద చెరువును వారు పరిశీలించారు. ఈ చెరువు కళంగి నుంచి ఒక మోస్తారుగా నీరు పారుతుండటంతో కళంగికి ఇరువైపుల ట్రాక్టర్ ట్రక్కులను పెట్టి రాకపోకలను నిలిపివేశారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు బసవరపుపాడు వాగు వరద ఉధృతికి అంబేడ్కర్ కాలనీ ముంపునకు గురైన నేపథ్యంలో ముందస్తుగా కాలనీవాసులను పునరావాస కేంద్రానికి పంపేలా అన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూమ్ నెంబర్లు 86882 29896, 94929 38116లకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ కోరారు.

చాట్రాయి: తుఫాన్‌ను ఎదుర్కోవటానికి అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని మండల స్పెషలాఫీసర్, డివిజనల్ అభివృద్ధి అధికారి వెంకటరత్నం, ఎంపీడీవో సత్యనారాయణ ఆదేశించారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తుఫాన్‌పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జనవాసాల దగ్గర ఉన్న చెరువులు తెగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆగిరిపల్లి: ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో టీ భార్గవి తెలిపారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఆగిరిపల్లి జెడ్పీ హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆగిరిపల్లి ఎస్ఐ కె శుభశేఖర్ తెలిపారు.

దెబ్బతిన్న మినుము పంట పరిశీలన

నూజివీడు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నగూడెంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న మినుము పంటను రైతు సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. గ్రామంలో దాదాపు 100 ఎకరాలకు పైగా సాగు చేస్తున్న మినుము పంట భారీ వర్షాలకు తడిచి మొలకెత్తి దెబ్బతిన్నదని నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో ఈ విధంగా పంట దెబ్బతిన్నదని, మంత్రి కొలుసు పార్థసారథి రైతులను ఆదుకోవాలని నాయకులు కోరారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునే దిశగా పంటనష్టాన్ని నమోదు చేసి వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని రైతు సంఘం నాయకులు చలసాని వెంకట రామారావు, నిమ్మగడ్డ నరసింహ, చాట్ల పుల్లారావు, నాగేంద్రం, పామర్తి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: తుఫాను వలన నష్టపోకుండా రైతులు ముందు జాగ్రత్తలు పాటించాలని మండల స్పెషలాఫీసర్, డివిజన్ అభివృద్ధి అధికారి వెంకటరత్నం, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో శివశంకర్ విజ్ఞప్తి చేశారు. చాట్రాయిలో సోమవారం కోతకు వచ్చిన వరి పొలాలను అధికారులు పరిశీలించి మాట్లాడుతూ మంగళ, బుదవారాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి పొలాల్లో వరద నిలవకుండా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని, కోసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు కప్పుకోవాలని, వరి కోతలు వర్షాలు తగ్గే వరకు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు.

ధాన్యం సేకరణపై శిక్షణ

ముదినేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణపై సోమవారం ముదినేపల్లి వ్యవసాయ శాఖ, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పౌరసరఫరాల శాఖ సాంకేతిక సిబ్బంది శిక్షణ ఇచ్చారు. ఏవో వేణుమాధవ్, మండల డీసీఎంఎస్ ఫీల్డ్ ఇన్‌చార్జి ఆర్.విజయకుమార్ ధాన్యం సేకరణలో పాటించాల్సిన జాగ్రత్తలను సూచించారు. పౌరసరఫరాల టెక్నికల్ అసిస్టెంట్లు బాలాజీ రాజు పాల్గొన్నారు.

భూగర్భ జలాల వృద్ధికే ప్రాధాన్యం

చాట్రాయి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల్లో భూగర్భ జలాల వృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందని ఏపీవో లక్ష్మీకుమారి అన్నారు. సోమవారం జరిగిన ఉపాధి గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ఒక్కో పంచాయతీలో భూగర్భ జలాలను పెంచటానికి లేబర్ బడ్జెట్‌లో 65 శాతం ఫారం పాండ్లు, చెక్‌డ్యాంలు, సోక్‌పిట్లు ప్రతిపాదించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చిందని వివరించారు.

హై అలర్ట్

(5వ పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రత్యే కాధికారి కాంతిలాల్ దండే అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 301 మైనర్ ఇరిగేషన్ చెరువులు సమస్యాత్మకం కాగా 129 మైనర్ ఇరిగేషన్ చెరువులు ప్రమాదకరమైనవిగా గుర్తించామన్నారు. ప్రమా దానికి మించిన నీటి ప్రవాహం వస్తే గండి కొట్టే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 763 హోర్డింగ్‌లు తొలగించామని, వంద మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. 123 మంది గర్భిణులను ప్రభుత్వాస్పత్రులకు తరలించామన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని 13 మండలాల్లో పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 14 మండలాల్లో హైఅలర్ట్ ప్రకటించామన్నారు. తుఫాన్ సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, జిల్లా యంత్రాంగంతో సహకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

తుఫాన్ సహాయక చర్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులతో సమీక్షించారు. తుఫాన్ ముగిసే వరకు మండల, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో ఉండి సహాయక చర్యలు పర్యవేక్షించాలని ఆదేశించారు. తుఫాన్ సహాయక కేంద్రాలలో భోజన, వసతి సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మొంథాకు ముందే మునిగిన మినుము రైతు

» నూజివీడు డివిజన్‌లో 90 శాతం పంట నష్టం

» 15 వేల ఎకరాల్లో మినుము సాగు

» ప్రభుత్వం ఆదుకోవాలని వినతి





దెబ్బతిన్న మినుము తోట చూపుతున్న సీపీఎం నాయకులు (ఇన్‌సెట్) మొలకవచ్చిన మినుము

నూజివీడు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): మొంథా తుపాన్‌కు ముందే మినుము రైతు నిండా మునిగాడు. వారంరోజులుగా నూజివీడు డివిజన్ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు కోతవచ్చిన మినుము మొలకెత్తి తీవ్రనష్టం చేకూరింది. నూజివీడు నియోజకవర్గ పరిధిలో నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాలు దాదాపుగా మెట్ట ప్రాంతాలుగా ఉన్నాయి. ప్రతి సీజన్‌లో ఈ మండలాల్లో సీడ్‌పత్తి సాగవుతూ ఉంటుంది. ప్రస్తుత సీజన్‌లో సీడ్ పత్తిని ఆర్గనైజర్లు ఇవ్వకపోవడంతో రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపారు. మొక్కజొన్న సీజన్ నవంబరు నుంచి ప్రారంభం అవుతుండడంతో తొలిపంటగా మెట్టప్రాంతంలో ఈసారి విస్తారంగా మినుము సాగు చేశారు. సరిగ్గా కోతకు వచ్చే సమయంలో అక్టోబరు ద్వితీయార్థం నుంచి భారీ వర్షాలు కురవడంతో నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో సాగవుతున్న కోతకు వచ్చిన మినుముపంట తడిచి ముద్దవుతోంది. నూజివీడు డివిజన్లలో 90 శాతం పంట నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. తడిచిన కాయి బూజురావడంతో పాటు అనేక ప్రాంతాల్లో కాయల్లోనే గింజలు మొలకెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఎకరానికి 40 వేలు ఖర్చు..

కౌలు, దుక్కి, విత్తనం, పురుగు మందులు, ఇతరత్రా కలిపి ఎకరానికి రూ.30వేల నుంచి రూ.40 వేలవరకు మినుము సాగుకు పెట్టుబడి అయంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రైతుకు ఒక్కరూపాయి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మొంథా ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ఇప్పటికే నష్టపోయిన మినుమును తీత తీయకుండానే దుక్కిదున్నేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన మినుముపంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టనివారణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పలు రైళ్లు, విమాన సర్వీసులు రద్దు

ఏలూరుక్రైం/భీమవరం క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. సోమవారం విశాఖ-ఎల్‌టీటీ (18519), మంగళవారం ఎల్‌టీటీ-విశాఖ(18520) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి తెలిపారు. అలాగే 28వ తేదీ మంగళవారం విజయవాడ-భీమవరం(67281), భీమవరం-విజయవాడ (67282), భీమవరం-నిడదవోలు (67283), నిడదవోలు-భీమవరం(67284), నరసాపురం- నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం (67245), నరసాపురం-రాజమండ్రి (67246), నరసాపురం-విజయవాడ (67276), భీమవరం-నిడదవోలు (67277), నిడదవోలు-భీమవరం(67278), నరసాపురం-గుంటూరు(67247), విజయవాడ-నరసాపురం (67257), రాజమండ్రి-భీమవరం(67241), 29వ తేదీ బుధవారం భీమవరం-నిడదవోలు(67242), నిడదవోలు-నరసాపురం(67243), నరసాపురం-నిడదవోలు (67244), నిడదవోలు-నరసాపురం(67245), భీమవరం-నరసాపురం(17263) రైళ్లను రద్దు చేశారు.


ఏలూరు జిల్లా మీదుగా..

తుఫాన్ నేపథ్యంలో ఏలూరు జిల్లా మీదుగా వెళ్లే కొన్ని రైళ్లను ఈనెల 28న కొన్ని రైళ్లను, ఈనెల 29న మరికొన్ని రైళ్లను రద్దు చేశారు. విజయవాడ-రాజమండ్రి (67262), విజయవాడ-కాకినాడ పోర్టు (17257), విజయవాడ- రాజమండ్రి(67202) రాజమండ్రి - విజయవాడ (67201), రాజమండ్రి - విజయవాడ (67261), కాకినాడ పోర్టు-విజయవాడ (17258), తిరుపతి-విశాఖపట్టణం (08584), విశాఖపట్టణం-గుంటూరు(22875), గుంటూరు- విశాఖపట్టణం(22876), తిరుపతి- విశాఖ పట్టణం(22708), హైదరాబాద్- విశాఖ పట్టణం(12728), మహబూబ్ నగర్- విశాఖ(12862), చెన్నై సెంట్రల్- విశాఖ (22870), సికింద్రాబాద్- విశాఖ(12740), భువనేశ్వర్-బెంగళూరు(18463), భువనేశ్వర్-సికింద్రాబాద్ (17015), భువనేశ్వర్-పాండిచ్చేరి (20851), సికింద్రాబాద్- భువనేశ్వర్(18464) రైళ్లను రద్దు చేశారు.

విమాన సర్వీసులు..

రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం (మధురపూడి) ఎయిర్‌పోర్టు నుంచి విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు అధికారులు అప్రమత్తం అయ్యారు. మంగళవారం ఉదయం 9-30గంటల లోపు నడిచే ఢిల్లీకి 1, హైదరాబాదుకు 2 సర్వీసులు మాత్రమే యథావిధిగా నడుస్తాయి. తరువాత సర్వీసులన్నీ రద్దు అయినట్టు ఎయిర్‌పోర్టు ఇన్‌చార్జి అధికారి వీరవల్లి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ముంబై, తిరుపతి, బెంగుళూరు, చెన్నై సర్వీసులు అన్నీ రద్దు అయి నట్లే. ఇక ఎయిర్‌పోర్టు రన్‌వే పరిసర ప్రాంతాల్లో నీరు చేరకుండా చెట్లకొమ్మలు అడ్డురాకుండా హెలికాప్టర్లు అత్యవసర సమయంలో లాండ్ అయ్యేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు



పూజలందుకున్న బలివే రామలింగేశ్వరస్వామి

ముసునూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా మండల వ్యాప్తంగా గల శివాలయాలు, నాగేంద్రస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బలివే శ్రీ రామలింగేశ్వర స్వామివారికి అర్చకులు విశేష పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు తమ్మిలేరులో పుణ్యస్నానాలు అచరించి, కార్తీక దీపారాధనలను చేసి, స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, ఈవో పామర్తి సీతారామయ్య పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

చాట్రాయి: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా చాట్రాయి, సి గుడిపాడు, తుమ్మగూడెం, కోటపాడు, పోలవరం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి ఆలయాల ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి, నాగ పుట్టలలో పాలు పోసి శివుడికి పూజలు చేశారు.

నూజివీడు టౌన్: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని నూజివీడులోని పలుశైవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా శివాలయాల్లో దీపాలు వెలిగించేందుకు మహిళలు బారులు తీరారు. ఈ సందర్భంగా కోటశివాలయం, దుర్గామల్లేశ్వర ఆలయం, వెలమపేట దుర్గాలయం తదితర ఆలయాల్లో భక్తులు పూజలు చేసి, కార్తీక దీపాలను వెలిగించారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి శోభనగిరిపై శ్రీదుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామికి, బస్టాండ్ సమీపంలో గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర దేవాలయంలో, వరాహ పుష్కరిణి సమీపంలో శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత ముక్తేశ్వరస్వామికి సోమవారంనాడు భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

విరిగిన కొమ్మ.. ట్రాఫిక్‌కు అంతరాయం

కలిదిండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.ఆర్పీ అగ్రహారంలో ఈదురుగాలులకు సోమవారం కలిదిండి - కోరుకొల్లు ప్రధాన రహదారిపై భారీ చెట్టు కొమ్మ విరిగిపడింది. దీంతో బస్సులు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ స్తంభించటంతో పంచాయతీ అధికారులు చెట్టుకొమ్మను తొలగించారు. రహదారి వెంబడి ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించటానికి అధికారులు చర్యలు తీసుకున్నారు.

కూలిన పూరింటి గోడలు


ముదినేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ముదినేపల్లి మండలం ములకలపల్లి దళితవాడలో రెండు పూరిళ్ళ గోడలు సోమవారం ఉదయం కూలి పోయాయి. దళితవాడలోని యాళ్ళ యేసుపాదం, పత్తిపాటి ముత్యాలు ఇళ్ళ మట్టి గోడలు వర్షాలకు నాని కూలిపోయాయి. మిగిలిన గోడలు కూడా నానిపోయి కూలే దశలో ఉండడంతో తహసీల్దార్ లతీఫ్ పాషా ఆదేశాలతో వీఆర్వో శ్రీరాములు రెండు కుటుంబాల వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు.



బైక్ దొంగల ముఠా అరెస్టు

ముదినేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో బైక్‌ల చోరీకి పాల్పడుతున్న ఓ ముఠాను ముదినేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి లక్షలాది రూపాయల విలువైన మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ సోమవారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముదినేపల్లి మండలం దేవపూడి రోడ్డులో ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు తన సిబ్బందితో సోమవారం ఉదయం వాహనాల తనిఖీ చేస్తుండగా, ముగ్గురు యువకులు బైక్‌పై అతి వేగంగా వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అనుమానంతో వెంటాడి వారిని అదుపులోకి తీసుకున్నారని, విచారణలో వారు ముదినేపల్లి మండలం ప్రొద్దువాక గ్రామానికి చెందిన యెండూరి జీవన రాజు, విజయవాడ అజిత్ సింగ్ నగర్‌కు చెందిన జలసూత్రం సాయి సురేష్, మరో బాలుడు బైక్ దొంగతనాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో ఈ ముగ్గురు రూ.11.05 లక్షల విలువైన బైక్‌లను విజయవాడ, తాడేపల్లి, కైకలూరు, ముదినేపల్లి ప్రాంతాల్లో దొంగతనాలు చేసి వాటిని ప్రొద్దువాక గ్రామంలో కుర్మా సుధాకర్ వద్ద దాచినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ వీరభద్రరావు పాల్గొన్నారు. నిందితులను పట్టుకుని, సొత్తును స్వాధీనం చేసుకోవటంలో ప్రతిభ చూపిన కైకలూరు సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు, ముదినేపల్లి పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్ల బి.నాగరాజు, శివకోటయ్య, వై.నాగరాజు, పవన్ కుమార్‌లను ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ అభినందించారు.

లాడ్జిలో ఒకరి అనుమానాస్పద మృతి



నూజివీడు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన నూజివీడు వెంకటేశ్వర లాడ్జిలో చోటుచేసుకుంది. విజయవాడ యనమలకుదురుకు చెందిన కపిలవాయి వెంకటరామరాజు (36) ఆదివారం రాత్రి నూజివీడు వెంకటేశ్వర లాడ్జిలో రూము తీసుకున్నాడు. సోమవారం ఉదయం లాడ్జి సిబ్బంది రూము శుభ్రం చేసేందుకు వెళ్ళగా వెంకట రామరాజు తన రూమ్‌లో అచేతనంగా పడి ఉన్నాడు. లాడ్జి సిబ్బంది సమాచారాన్ని నూజివీడు పట్టణ పోలీసులకు అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనపరుచుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. కాగా అతని వద్ద ఖాళీ అయిన ట్యాబ్‌లెట్ల కవర్లు ఉండటంతో వైద్యం చేయించుకునేందుకు వచ్చి మృతి చెందాడా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే అంశంపై విచారణ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.